ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శనివారం 14-11-2026 | Saturday 14 November, 2026 | విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 01 సంచిక: 279 | Vol.No 01 Issue No . 279 | Vijayawada | www.visionandhra.in

ఏపీ అభివృద్ధి ప్రస్థానంపై

'టైమ్' ప్రత్యేక ప్రశంసలు



– ఏపీ ప్రగతి నమూనా ప్రపంచానికి చాటుతాం: 'టైమ్' ఇంటర్నేషనల్ ఎండీ డామియన్ డగ్గన్

– రాష్ట్రంలో శరవేగంగా ప్రాజెక్టుల గ్రౌండింగ్...ఆరు నెలల్లోనే 'గూగుల్'కు శంకుస్థాపన : సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం, పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం సాధిస్తోన్న పురోగతిని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పేలా విశాఖపట్నంలో 'టైమ్ ఇంపాక్ట్ డిన్నర్' కార్యక్రమం నిర్వహించారు. సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ సందర్భంగా గురువారం రాత్రి ది పార్క్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'టైమ్' ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డామియన్ డగ్గన్‌తో ప్రత్యేక ముఖాముఖిలో పాల్గొన్నారు. సుమారు 100 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపార, ప్రభుత్వ రంగ ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులకు సానుకూల వాతావరణం, వేగవంతంగా ప్రాజెక్టుల అమలు తదితర అంశాలపై సీఎం చంద్రబాబు తన అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడమే కాకుండా, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టులు వేగంగా గ్రౌండింగ్ అవ్వడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గూగుల్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ హబ్ ఏర్పాటుకు 2025 అక్టోబర్‌లో ప్రకటించగా, కేవలం ఆరు నెలల్లోనే 2026 ఏప్రిల్‌లో శంకుస్థాపన జరిగిందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ నిర్ణయాల్లో వేగం, పెట్టుబడుల అమలులో చిత్తశుద్ధి ఎలా ఉంటాయో చెప్పడానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు.

అద్భుత నాయకత్వం-అసాధారణ అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల పురోగతిని ప్రపంచానికి పరిచయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు 'టైమ్' ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు రావాలని, అప్పటికి రాష్ట్రం సాధించిన ప్రగతిని స్వయంగా పరిశీలించి ప్రపంచానికి తెలియజేయాలని 'టైమ్' సంస్థను ఆహ్వానించారు. 'టైమ్' ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డామియన్ డగ్గన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం, రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న అసాధారణ అభివృద్ధి తనకు ఎంతో ఆసక్తి కలిగించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న అనేక విజయాలు...అద్భుత నాయకత్వం, దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విజయగాథను, రాష్ట్ర అభివృద్ధి నమూనాను ప్రపంచానికి పరిచయం చేస్తామని డగ్గన్ వెల్లడించారు.

'బిల్డ్ ద నెక్స్ట్ చాప్టర్ ఆఫ్ గ్రోత్'పై ప్యానల్ చర్చ

ముఖ్యమంత్రి ముఖాముఖి అనంతరం 'బిల్డ్ ద నెక్స్ట్ చాప్టర్ ఆఫ్ గ్రోత్' అనే అంశంపై ప్రత్యేక ప్యానెల్ చర్చ నిర్వహించారు. వరాహ క్లైమేట్‌ఏజీకి చెందిన మధుర్ జైన్, పబ్లిసిస్ గ్రూప్ సీఈఓ అనుప్రియ ఆచార్య, ఇసుజు మోటార్స్ ఇండియా ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్, ఆసియా అభివృద్ధి బ్యాంకు సౌత్ ఆసియా విభాగం ఇండియా రెసిడెంట్ మిషన్ కంట్రీ డైరెక్టర్ మియో ఓకా పాల్గొన్నారు. టైమ్100 నెక్స్ట్ఇండియా సీనియర్ ప్రొడ్యూసర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ గాయత్రి రంగాచారి షా ఈ చర్చకు మోడరేటర్‌గా వ్యవహరించారు. ప్రపంచ వృద్ధికి దోహదపడే భాగస్వామ్యాలు, భవిష్యత్ అవకాశాలు, పెట్టుబడులు, సుస్థిర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

పారిశ్రామికవేత్తలకు

ఫోన్ కాల్ దూరంలో రాష్ట్ర ప్రభుత్వం

– ఏపీలో గ్రీన్ ఎనర్జీ, ఐటీ, క్రీడా రంగాల్లో విస్తృత అవకాశాలు

– ఏపీలో పెట్టుబడులకు ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ కు సీఎం చంద్రబాబు ఆహ్వానం



విశాఖపట్నం, నవంబర్ 13: ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక వేత్తలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వేగంగా అనుమతులివ్వడానికి యంత్రాంగం పూర్తిగా సహకారం అందిస్తుందని వెల్లడించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఆర్పీఎస్ జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందడానికి లీడర్‌షిప్ బ్యాండ్ విడ్త్ కీలకమని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, ఐటీ సేవలు, క్రీడలు, వస్త్రాలు, ఫ్యాషన్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నట్టు వివరించారు. పుర్వా గ్రీన్ పవర్ ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే 349.8 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు, సుమారు రూ.3,286 కోట్ల పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో... సౌర విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ , గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో అదనపు పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి వివరించారు.

క్రీడా పురస్కారాలు ప్రదానం

– రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల అందజేత

– ద్రోణాచార్య, అర్జున, టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలు ప్రదానం

న్యూఢిల్లీ, నవంబర్ 13: (విజన్ ఆంధ్ర)

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2025 సంవత్సరానికి సంబంధించిన క్రీడా, సాహస పురస్కారాలను ప్రదానం చేశారు. నవంబర్ 13న రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, శిక్షకులు, సంస్థలకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్రోణాచార్య పురస్కారం2025, అర్జున పురస్కారం2025, టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారం2024, జాతీయ క్రీడా ప్రోత్సాహక పురస్కారం2025లను రాష్ట్రపతి ప్రదానం చేశారు.క్రీడా రంగంలో విశేష ప్రతిభను ప్రదర్శించినవారిని, క్రీడాకారులకు శిక్షణ అందించి వారి విజయాలకు తోడ్పడిన కోచ్‌లను, సాహస క్రీడల్లో అసాధారణ ప్రతిభ కనబరిచినవారిని ఈ పురస్కారాల ద్వారా గౌరవించారు.



క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్న సంస్థలకు కూడా జాతీయ క్రీడా ప్రోత్సాహక పురస్కారాలను అందజేశారు.దేశంలో క్రీడా ప్రతిభను గుర్తించి, క్రీడాకారులు మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు

బెంగళూరులో రూ.15,600 కోట్ల

అభివృద్ధి ప్రాజెక్టులు



– మెట్రో, రైల్వే, ఇంధన రంగాలకు కొత్త ఊతం.. ప్రారంభించిన ప్రధాని మోదీ

– మౌలిక సదుపాయాలతో అభివృద్ధి, ఉద్యోగాలు, పరిశ్రమలకు కొత్త అవకాశాలు: ప్రధాని

న్యూఢిల్లీ, నవంబర్ 13: (విజన్ ఆంధ్ర)

కర్ణాటక రాజధాని బెంగళూరులో రూ.15,600 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. మరికొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడంతో పాటు కొత్త పనులకు శంకుస్థాపనలు చేసి, వాటిని ప్రారంభించారు. మౌలిక సదుపాయాలు, రవాణా అనుసంధానం, ఇంధన భద్రతకు సంబంధించిన ఈ ప్రాజెక్టులు కర్ణాటక అభివృద్ధికి కొత్త వేగాన్ని అందిస్తాయని ప్రధాని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, ఏ దేశ అభివృద్ధి ప్రయాణంలోనైనా మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మెరుగైన రవాణా అనుసంధానం వల్ల అభివృద్ధి, ఉపాధి, పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. సమాజంలోని అన్ని వర్గాలకు అభివృద్ధి అవకాశాలు అందినప్పుడు పేదరికంపై పోరాటం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో సుమారు 50 కోట్ల మంది ప్రజలు అత్యంత పేదరికం నుంచి బయటపడటం దీనికి ప్రత్యక్ష నిదర్శనమని తెలిపారు.కన్నడ భాషలో ప్రజలకు అభివాదం చేసిన ప్రధాని, బెంగళూరు నగర అధిష్ఠాత్రి దేవత అన్నమ్మ తాయి, నాడప్రభు కెంపేగౌడలకు నివాళులర్పించారు.


ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు దాటాయి

– వంద రోజుల్లో బకాయిలు చెల్లిస్తామన్న హామీ ఏమైంది?

– తక్షణమే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి వైఎస్ షర్మిల డిమాండ్

అమరావతి: (విజన్ ఆంధ్ర)

ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు దాటిపోయాయని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆమె ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే గొప్ప అవకాశంగా ఉండేదని షర్మిల గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఈ పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు రూ.6,400 కోట్లు దాటాయని, గత మూడేళ్లలోనే రూ.6,000 కోట్లకు



పైగా పేరుకుపోయాయని తెలిపారు.ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను షర్మిల ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ చెల్లిస్తామని, నేరుగా కళాశాలల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తామని ప్రకటించిన మాటలు ఏమయ్యాయని నిలదీశారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి అమలును పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ఉన్నత చదువులు కొనసాగించాలనుకునే విద్యార్థులు, ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల విద్యా భవిష్యత్తు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

ఒకవైపు రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, మరోవైపు పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉంచడం ఏమిటని షర్మిల ప్రశ్నించారు. పెట్టుబడుల ప్రచారంతో పాటు విద్యార్థుల విద్యకు సంబంధించిన బాధ్యతలను కూడా ప్రభుత్వం సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని, కళాశాలలకు నేరుగా నిధులు చెల్లించి విద్యార్థులకు ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

ఓలాపై రూ.10 లక్షల జరిమానా



– ప్రయాణానికి ముందే అదనపు చెల్లింపుల సూచనలు నిలిపివేయాలి

– 'టిప్' పేరుతో ప్రయాణికులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు సీసీపీఏ నిర్ధారణ

న్యూఢిల్లీ, నవంబర్ 13: (విజన్ ఆంధ్ర)

ప్రయాణం పూర్తికాకముందే అదనపు చెల్లింపులు చేయాలని ప్రయాణికులను ప్రోత్సహించే విధానాన్ని అనుసరించినందుకు ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఓలాపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) రూ.10 లక్షల జరిమానా విధించింది. ఈ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని ఓలాను ఆదేశించింది. ప్రయాణికులను తప్పుదోవ పట్టించే ఈ విధానం అన్యాయమైన వ్యాపార పద్ధతిగా, గందరగోళానికి కారణమయ్యేదిగా ప్రాధికార సంస్థ పేర్కొంది.ఓలా నిర్వహణ సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తన అనువర్తనంలో 'టిప్' లేదా 'అదనపు చెల్లింపు' పేరుతో ప్రయాణానికి ముందే వినియోగదారుల నుంచి అదనపు మొత్తాన్ని కోరుతోంది. డ్రైవర్ కోసం అన్వేషణ జరుగుతున్న సమయంలో ఈ సూచనలు కనిపించేవి. అదనపు మొత్తం చెల్లిస్తే త్వరగా వాహనం లభించే అవకాశాలు పెరుగుతాయన్న భావనను కలిగించేవి. ఈ అంశంపై విచారణ జరిపిన సీసీపీఏ, ఓలా విధానంలో పారదర్శకత లోపించిందని తేల్చింది.సీసీపీఏ ప్రధాన కమిషనర్ నిధి ఖరే, కమిషనర్ అనుపమ్ మిశ్రా నేతృత్వంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఓలా తొలుత ఈ సదుపాయాన్ని 'టిప్'గా పేర్కొనగా, ఆ తరువాత 'యాడ్-ఆన్'గా పేరు మార్చింది. అయితే పేరు మారినప్పటికీ, ప్రయాణానికి ముందే అదనపు చెల్లింపులను ప్రోత్సహించే అసలు విధానంలో మార్పు లేదని ప్రాధికార సంస్థ గుర్తించింది.

స్థానిక ఎన్నికల్లో దౌర్జన్యాలు: బుగ్గన ఆరోపణ

– పంచాయతీ ఎన్నికలనైనా ప్రశాంతంగా నిర్వహించాలి

– కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కు మాజీ మంత్రి వినతిపత్రం

కర్నూలు: (విజన్ ఆంధ్ర)

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంలో విఫలమైందని ఆరోపించారు. రాబోయే పంచాయతీ ఎన్నికలైనా ప్రశాంతంగా, నిష్పాక్షిక వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ మేరకు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఘర్షణలు, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే తెలుగుదేశం పార్టీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయని, పలువురు అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేసి ఇబ్బందులకు గురిచేశాయని విమర్శించారు.తంలో ఆంధ్రప్రదేశ్‌కు మంచి గుర్తింపు ఉండేదని, అయితే ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న దాడులు, హింసాత్మక ఘటనలతో రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతింటోందని బుగ్గన వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టాయని ఆరోపించారు.ప్రజాస్వామ్యానికి గ్రామ పంచాయతీలే పునాదులని, రాజకీయ వ్యవస్థకు గ్రామాలే మూలమని బుగ్గన పేర్కొన్నారు. గ్రామీణ ఎన్నికల్లో ఓటర్లు, అభ్యర్థులపై ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు లేకుండా



ఎన్నికల ప్రక్రియ జరిగేలా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల్లో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియకు భంగం కలగకుండా రాబోయే పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించేలా పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బుగ్గన కోరారు.

సంపాదకీయం

కాంగ్రెస్ కు బీలాంగింగ్ వరమా...శాపమా...

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైనప్పటి నుండి భారత రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఆమె ప్రస్తావించిన పలు కీలక చారిత్రక అంశాలను ఆయుధంగా చేసుకుని భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగుతోంది.ముఖ్యంగా రాబోయే ఉత్తరప్రదేశ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పుస్తకంలోని అంశాలు బీజేపీకి రాజకీయంగా కలిసొచ్చే అస్త్రాలుగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.బీజేపీకి అస్త్రాలుగా మారిన ప్రధాన అంశాలు? ఎమర్జెన్సీ ప్రస్తావన. 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటు అని, తర్వాత ఇందిర కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా ఈ పుస్తకంలో పేర్కొన్నారు. దీనిపై బీజేపీ స్పందిస్తూ, నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఆమె ప్రయత్నిస్తున్నారని, ఈ పుస్తకానికి 'బిలాంగింగ్' బదులు 'వైట్‌వాషింగ్' అని పేరు పెట్టి ఉండాల్సిందని బీజేపీ అధికార ప్రతినిధి సి.ఆర్. కేశవన్ విమర్శించారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు. ఈ పుస్తకంలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లపై తన కుటుంబానికి క్లీన్ చిట్ ఇచ్చుకునే ప్రయత్నం జరిగిందని బీజేపీ ఆరోపిస్తోంది. పంజాబ్ ఎన్నికల ముంగిట ఈ అంశం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా, బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది. ముందు తన పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో ఈ విషయంపై చర్చించినట్లు సోనియా వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాను ప్రధానమంత్రి పదవి చేపట్టాలా? అని వారిని అడిగినప్పుడు ఇద్దరూ స్పష్టంగా వద్దని చెప్పారని రాశారు. ఇందిరా గాంధీ హత్య, రాజీవ్ గాంధీ హత్యను ప్రత్యక్షంగా చూసిన తమకు, తల్లి కూడా ప్రధానమంత్రి అయితే కుటుంబానికి ముప్పు పెరుగుతుందనే భయం ఉండేదని ఆమె వివరించారు. తాను ప్రధాని కావడం లేదని చెప్పినప్పుడు పిల్లలు ఎంతో ఉపశమనం పొందారని గుర్తుచేసుకున్నారు.2004 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలా? వద్దా? అనే విషయంలో తాను తీవ్ర మానసిక సంఘర్షణకు గురయ్యానని సోనియా గాంధీ రాశారు. ఒకవైపు కాంగ్రెస్ కార్యకర్తల ఆశలు, ప్రజల నమ్మకం, మరోవైపు తన వ్యక్తిగత భయాలు, కుటుంబ భద్రత వంటి అంశాలు తనను ఆలోచనలో పడేశాయని తెలిపారు. చివరకు ప్రధానమంత్రి పదవిని తిరస్కరించాలని నిర్ణయించుకున్న రాత్రి తన మనసులోని సందేహాలన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. తన అంతరాత్మ నుంచి 'సోనియా.. నీకు నువ్వు నిజాయితీగా ఉండు. ఈ విషయం నీకు ఎప్పటినుంచో తెలుసు. దాన్ని వదిలేయ్!' అనే భావన కలిగిందని పుస్తకంలో వివరించారు.తన నివాసంలో కాంగ్రెస్, సంకీర్ణ పార్టీల నేతలు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలని కోరిన సమావేశాన్ని కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ తనను 'మీరు ప్రధానమంత్రి కావడానికి ఎందుకు అంగీకరించారు?' అని ప్రశ్నించారని తెలిపారు. నాయకులు తన మాట వినడం లేదని, ఒత్తిడి చేస్తున్నారని తాను సమాధానమిచ్చినట్లు రాశారు. మరోవైపు ప్రియాంక గాంధీ కూడా తన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారని, ఆ సమయంలో ఆమె భావోద్వేగానికి గురయ్యారని వెల్లడించారు.తాను ప్రధానమంత్రి అయితే బీజేపీ, దాని మిత్రపక్షాలు తన విదేశీ మూలాన్ని రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని సోనియా భావించారు. దీనివల్ల దేశంలో రాజకీయ వివాదం పెరిగి, ప్రభుత్వం పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందారు. తనకు ప్రధానమంత్రి పదవి కంటే దేశంలో స్థిరమైన, సమర్థవంతమైన, లౌకిక ప్రభుత్వం ఏర్పడటమే ముఖ్యమని పేర్కొన్నారు.2004లో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ నేతల సమావేశంలో తాను ప్రధానమంత్రి పదవిని చేపట్టబోనని ప్రకటించినప్పుడు పలువురు నాయకులు నిరసన వ్యక్తం చేశారని సోనియా గుర్తుచేసుకున్నారు. కొందరు నిర్ణయం మార్చుకోవాలని కోరడంతో కొద్దిసేపు ప్రసంగాన్ని ఆపాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అనంతరం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును ప్రధానమంత్రి పదవికి ప్రతిపాదించారు. దీంతో యూపీఏ ప్రభుత్వానికి మన్మోహన్ సింగ్ నాయకత్వం వహించారు.మొత్తంగా, ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వెనుక కుటుంబ భద్రత, రాజకీయ పరిస్థితులు, వ్యక్తిగత సిద్ధాంతాలు కీలకంగా ఉన్నాయని సోనియా గాంధీ తన ఆత్మకథలో వివరించారు. 2004లో దేశ రాజకీయాలను మలుపు తిప్పిన తన నిర్ణయంపై ఇన్నేళ్ల తర్వాత ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.2004 ప్రధాని పదవి త్యాగం మరియు 'సూపర్ పీఎం'. 2004లో తాను ప్రధాని పదవిని ఎందుకు వదులుకున్నానో సోనియా ఈ పుస్తకంలో వివరించారు. అయితే, 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం పడిపోయినప్పుడు సంఖ్యాబలం లేకపోయినా ఆమె ప్రధాని కావాలని ఆశపడ్డారని బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది విమర్శించారు. 2004లో ప్రధాని పదవిని వదులుకున్నట్లు నటిస్తూ, నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా ఉంటూ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై పెత్తనం చెలాయించి 'సూపర్ పీఎం' గా వ్యవహరించారని బీజేపీ దుయ్యబట్టింది. భారత పౌరసత్వం వివాదం. 1968లో రాజీవ్ గాంధీని వివాహం చేసుకుని భారత్‌కు వచ్చిన సోనియా, 1983 వరకు అంటే 15 ఏళ్ల పాటు ఇటలీ పాస్‌పోర్టునే ఎందుకు కొనసాగించారన్న పాత వివాదాలను బీజేపీ నేతలు మళ్లీ తెరపైకి తెచ్చారు. రాజీవ్ గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించే సమయానికే ఆమె భారత పౌరసత్వం తీసుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని బీజేపీ ప్రశ్నిస్తోంది. బాబ్రీ మసీదు కూల్చివేత. 1992 నాటి బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనపై సోనియా చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ తప్పుబట్టింది. దశాబ్దాల పాటు భారత రాజకీయాల చక్రం తిప్పిన 10 జన్ పథ్ తెరవెనుక అధికార ప్రస్థానాన్ని, 1998లో కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తీరును, యూపీఏ-1, యూపీఏ-2 సంకీర్ణ ప్రభుత్వాల నిర్వహణలోని అంతర్గత ఒత్తిళ్లను సోనియా ఈ పుస్తకంలో స్పృశించారు. నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో తన అనుబంధం, 2004లో ప్రధాని పదవిని త్యాగం చేయడం వెనుక ఉన్న అంతరంగిక నిర్ణయాలు, కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల అంతర్గత కుమ్ములాటల గుట్టును బయటపెట్టడం జాతీయ స్థాయిలో తీవ్ర రాజకీయ దుమారానికి కారణమైంది.ప్రతిపక్ష అధికార ఎన్‌డీయే కూటమి నాయకులు ఈ ఆత్మకథపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. యూపీఏ హయాంలో జరిగిన పలు ఆర్థిక కుంభకోణాలు, సూపర్ ప్రైమ్ మినిస్టర్ గా నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ ద్వారా సమాంతర అధికారాన్ని చెలాయించారన్న ఆరోపణలను కప్పిపుచ్చుకోవడానికే సోనియా ఈ పుస్తకం ద్వారా సింపథీ కార్డ్ ని ప్రయోగిస్తున్నారని అధికార వర్గాలు విమర్శిస్తున్నాయి. 2004-2014 మధ్యకాలంలో జరిగిన తెరవెనుక రాజకీయాలను తనకు అనుకూలమైన రీతిలో మలచుకున్నారనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు , ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు మాత్రం సోనియా రాసిన పుస్తకాన్ని సమర్థిస్తున్నాయి. దేశం కోసం భర్తను, అత్తను కోల్పోయినా.. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు, పార్టీ ఉనికికి ఆమె చేసిన త్యాగాలను బిలాంగింగ్ పుస్తకం ప్రపంచానికి చాటిచెబుతోందని అభివర్ణిస్తున్నారు. ఒక విదేశీ మూలాలున్న మహిళగా ఎదుర్కొన్న ఆక్షేపణలను అధిగమించి, భారతీయతను తన సొంతం చేసుకున్న తీరును ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పుస్తక ప్రభావం కేవలం గత చరిత్రకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సాగించే నెరేటివ్ యుద్ధానికి ప్రధాన ఇంధనంగా మారనుంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల రాజకీయ ప్రస్థానానికి గాంధీ కుటుంబ త్యాగాల నేపథ్యాన్ని మరోసారి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి ఇది ఒక మాధ్యమంగా ఉపయోగపడనుంది. అదే సమయంలో, బీజేపీ దీనిని ఎదుర్కొనేందుకు యూపీఏ కాలం నాటి పాలనా వైఫల్యాలను, ప్యాలెస్ రాజకీయాలను తిరిగి ఎండగట్టే అవకాశం ఉంది. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనేది కేవలం సోనియా గాంధీ జ్ఞాపకాల సమాహారం మాత్రమే కాదు. అది ఆధునిక భారత రాజకీయ చరిత్రలోని అత్యంత కీలకమైన ఘట్టాలకు అద్దం పట్టే ఒక వివాదాస్పద పత్రం. ప్రేమ, కోల్పోవడం, సాధికారత, అధికార పోరాటాల మధ్య సాగిన ఒక మహిళ జీవిత ప్రయాణం ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్-బీజేపీల మధ్య సరికొత్త పొలిటికల్ డిబేట్‌ను రాజేసింది.యూపీ ఎన్నికల ముందు ఈ అంశాన్ని లేవనెత్తడం ద్వారా హిందూ ఓటర్లను ఆకట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.మొత్తంగా, వ్యక్తిగత జ్ఞాపకాలు మరియు రాజకీయ ప్రస్థానాన్ని వివరిస్తూ సోనియా గాంధీ రాసిన ఈ పుస్తకం, కాంగ్రెస్ పార్టీకి రక్షణ కవచంగా మారడానికి బదులు, పాత వివాదాలను మళ్లీ తవ్వితీసి బీజేపీకి రాజకీయంగా బలమైన అస్త్రాలను అందించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బెంగళూరులో రూ.15,600 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు

మొదటిపేజీ తరువాయి

మెట్రో, రైల్వే, ఇంధన భద్రతకు సంబంధించిన ప్రాజెక్టులు బెంగళూరు, కర్ణాటక అభివృద్ధి ప్రయాణానికి మరింత బలాన్ని చేకూరుస్తాయని చెప్పారు.

నమ్మ మెట్రో నెట్‌వర్క్ 100 కిలోమీటర్లకు పైగా

బెంగళూరులో కొత్తగా ప్రారంభించిన పింక్ లైన్ మెట్రో కారిడార్ గురించి ప్రధాని ప్రస్తావించారు. ఈ మార్గం ద్వారా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరు (ఐఐఎం), నగరంలోని పలు విద్యాసంస్థలు, ప్రధాన వాణిజ్య, సాంకేతిక కేంద్రాలకు రవాణా అనుసంధానం మెరుగుపడుతుందని తెలిపారు. దీనివల్ల లక్షలాది మంది ప్రయాణికులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని పేర్కొన్నారు.2014లో కేవలం 17 కిలోమీటర్ల మేర ఉన్న నమ్మ మెట్రో నెట్‌వర్క్ ప్రస్తుతం 100 కిలోమీటర్లకు పైగా విస్తరించిందని మోదీ వెల్లడించారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై మహానగర ప్రాంతాల తర్వాత 100 కిలోమీటర్లకు పైగా మెట్రో నెట్‌వర్క్ కలిగిన దేశంలోని మూడో నగరంగా బెంగళూరు నిలిచిందని చెప్పారు.నమ్మ మెట్రో విజయాన్ని కేవలం ఒక ప్రాజెక్టుకు పరిమితం చేయలేమని, సులభమైన జీవనం, సౌకర్యవంతమైన ప్రయాణంపై దేశం అనుసరిస్తున్న నూతన విధానానికి ఇది ప్రతిఫలమని అన్నారు. మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ ప్రాజెక్టులు నిదర్శనమని పేర్కొన్నారు.దివంగత నేత అనంత్ కుమార్ వర్ధంతిని ప్రస్తావించిన ప్రధాని, ఆయనకు ఘన నివాళి అర్పించారు. బెంగళూరులో మెట్రో విస్తరణను చూసి ఆయన ఆత్మ సంతోషిస్తుందని వ్యాఖ్యానించారు.

రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు ప్రాధాన్యం

కర్ణాటకలోని రైల్వే స్టేషన్లను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. చామరాజనగర్, చిక్కమగళూరు, సకలేశ్‌పూర్, సుబ్రహ్మణ్య రోడ్ సహా 60కి పైగా స్టేషన్లలో కొత్త రూపంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వందేభారత్ రైళ్లు, అమృత్ భారత్ స్టేషన్ల ద్వారా రైల్వే స్టేషన్లు, ఇంజిన్లు, బోగీల్లో భారతీయ ప్రత్యేకతను ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆధునిక సదుపాయాలతో పాటు సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. గతంలో విమానాశ్రయాల్లో మాత్రమే కనిపించే సదుపాయాలను ఇప్పుడు పేద, మధ్యతరగతి కుటుంబాలకు రైల్వే స్టేషన్లలో అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.గత 10 నుంచి 12 సంవత్సరాల్లో దేశ రైల్వే బడ్జెట్ గణనీయంగా పెరిగిందని, కర్ణాటకకు రైల్వే బడ్జెట్ కేటాయింపులు తొమ్మిది రెట్లు పెరిగాయని ప్రధాని వెల్లడించారు. రాష్ట్రానికి నాలుగు అమృత్ స్టేషన్లు, రెండు రైల్వే లైన్ల ద్వంద్వీకరణ, విద్యుదీకరణ ప్రాజెక్టులు అందించినట్లు చెప్పారు.కర్ణాటకకు ఇటీవలే తొలి వందేభారత్ స్లీపర్ రైలు అందగా, తాజాగా గోవాతో అనుసంధానించే మరో వందేభారత్ రైలును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రైలు ద్వారా మంగళూరు సహా కర్ణాటక తీరప్రాంతంలో ప్రయాణించే వారికి సెమీ హైస్పీడ్ రైలు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

ఇంధన భద్రతకు కొత్త ప్రాజెక్టులు

ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల చుట్టూ కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ఇంధన భద్రత ప్రాముఖ్యతను మరోసారి చాటాయని ప్రధాని మోదీ అన్నారు. గత దశాబ్దంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ఉత్పత్తి విస్తరణ, ముడి చమురు నిల్వ సామర్థ్యం పెంపు, సౌర, జల, పవన విద్యుత్ అభివృద్ధి, రైల్వేల విద్యుదీకరణ, మెట్రో నెట్‌వర్క్ విస్తరణ వంటి చర్యల వల్ల భారత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటోందని వివరించారు.కర్ణాటకలో ప్రారంభించిన మూడు కీలక ఇంధన ప్రాజెక్టులను ప్రధాని ప్రస్తావించారు. మంగళూరు ఎల్పీజీ ప్రాజెక్టు ద్వారా 80 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. దేవణగొంతి మార్కెటింగ్ టెర్మినల్ ద్వారా పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరా మరింత క్రమబద్ధీకరించబడుతుందని చెప్పారు.
బెంగళూరు కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ రోజుకు 13 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి చేయగలదని వెల్లడించారు. ఈ ప్లాంట్ వల్ల వ్యర్థాల నిర్వహణ మెరుగుపడటంతో పాటు సహజ వాయువు దిగుమతులపై భారం తగ్గుతుందని పేర్కొన్నారు.

పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 300 గిగావాట్లకు పైగా

చిప్ నుంచి షిప్ వరకు, కృత్రిమ మేధ (ఏఐ), డేటా కేంద్రాల నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు నూతన సాంకేతిక రంగాల్లో ప్రపంచ నాయకత్వం సాధించాలంటే విశ్వసనీయమైన విద్యుత్ ఉత్పత్తి అవసరమని ప్రధాని అన్నారు. స్వచ్ఛ ఇంధన లక్ష్యాలను సాధించేందుకు దేశంలో అణు విద్యుత్ కేంద్రాలను విస్తరిస్తున్నట్లు వివరించారు.
భారత్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 300 గిగావాట్లకు పైగా చేరిందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలు కేవలం విద్యుత్ వినియోగదారులుగా కాకుండా విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారుతున్నారని పేర్కొన్నారు.ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద దేశవ్యాప్తంగా 60 లక్షలకు పైగా కుటుంబాలు, కర్ణాటకలో 40 వేలకుపైగా కుటుంబాలు ప్రభుత్వ సహకారంతో తమ ఇళ్లపై సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. ఒక్కో కుటుంబానికి సుమారు రూ.80 వేల మేర సహాయం అందించినట్లు వెల్లడించారు.ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద కర్ణాటక రైతుల సాగునీటి అవసరాల కోసం 8 లక్షలకు పైగా సౌర పంపులను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనివల్ల విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు ఆదాయం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటక రైతులు అన్నదాతలుగానే కాకుండా ఇంధనదాతలుగా కూడా మారుతున్నారని వ్యాఖ్యానించారు.

మధ్యతరగతి ఆకాంక్షలకు ప్రాధాన్యం

2014 తర్వాత 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం, పన్నుల రూపంలో వచ్చిన నిధుల సమర్థ వినియోగం వల్ల మధ్యతరగతి విస్తరించిందని ప్రధాని అన్నారు. నూతన ఆకాంక్షలతో కూడిన వర్గం ఏర్పడిందని పేర్కొన్నారు.ఈ వర్గం గృహోపకరణాలు, ద్విచక్ర వాహనాలు, నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు, పర్యాటక అనుభవాలను కోరుకుంటోందని తెలిపారు. పెరుగుతున్న ఈ ఆకాంక్షలు ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, పర్యాటక, సేవారంగాల్లో కొత్త పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనకు దోహదపడుతున్నాయని వివరించారు. నూతన మధ్యతరగతి దేశ ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మారుతోందని, కర్ణాటక, బెంగళూరులో ఈ వర్గం పెద్ద సంఖ్యలో ఉందని అన్నారు.
మధ్యతరగతి ప్రజల పొదుపు పెంచడం, వారి చేతుల్లో ఖర్చు చేయగల ఆదాయం మరింత అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మోదీ తెలిపారు. వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు, సీనియర్ సిటిజన్లు, అద్దె ఆదాయం పొందేవారికి ప్రయోజనం కలిగించేలా టీడీఎస్ నిబంధనల్లో మార్పులు, తదుపరి తరం జీఎస్టీ సంస్కరణల ద్వారా రోజువారీ వస్తువుల ధరలు తగ్గించే చర్యలను ప్రస్తావించారు.వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీని తొలగించడం ద్వారా బీమా సేవలను మరింత అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు.

కుటుంబాల కలలకు అభివృద్ధి తోడ్పాటు

కర్ణాటకలో ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టులు దేశ ప్రగతి ప్రయాణానికి మరింత వేగాన్ని అందిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. మధ్యతరగతి కుటుంబాలను శక్తివంతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు.ప్రజల పొదుపు పెరగడం, కొనుగోలు శక్తి బలోపేతం కావడం ద్వారా వారు తమ కుటుంబాల కలలను నెరవేర్చుకోవడంతో పాటు దేశ ఆర్థిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. బెంగళూరును సాంకేతిక నగరంగా మరింత బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధి చెందిన కర్ణాటక ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు ఫోన్ కాల్ దూరంలో రాష్ట్ర ప్రభుత్వం



మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం విజయవాడలోని మేధా ఐటీ టవర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆర్‌పీఎస్‌జీ గ్రూప్‌కు చెందిన ఫస్ట్‌సోర్స్ సంస్థను విశాఖపట్నం, తిరుపతికి విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందిస్తూనే సామాజిక బాధ్యతగా పీ4 అనే ప్రతిష్టాత్మక కార్యక్రమం చేపట్టామని.. పేదలకు చేయూత అందించేందుకు ముందుకు రావాలని ఆర్పీఎస్జీ గ్రూప్ ను సీఎం కోరారు.

ఏపీలో అందే సహకారం ఇంకెక్కడా లేదు : శాశ్వత్ గోయెంకా

పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు ఏపీలో అందుతున్న సహకారం దేశంలో ఇంకెక్కడా లేదని.. ఈ అంశంలో ఏపీ రోల్ మోడల్ అని ఆర్పీఎస్జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకా ముఖ్యమంత్రితో అన్నారు. రాష్ట్ర వనరులు, పెట్టుబడి అవకాశాలపై సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రజెంటేషన్ అద్భుతంగా ఉందని ఆయన ప్రశంసించారు. ఏపీలో పెట్టుబడులకు, తమ కార్యకలాపాల విస్తరణకు సిద్ధంగా ఉన్నామని గోయెంకా వివరించారు.

పోర్టులు, పెట్రో కెమికల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో

పెట్టుబడులకు సహకరించండి

– అమరావతిలో ఖతార్ కార్యాలయం ఏర్పాటు చేయండి : సీఎం చంద్రబాబు
– ఏపీలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలిస్తాం... త్వరలో అధికారిక బృందం పర్యటన : ఖతార్ రాయబారి మహ్మద్ హసన్ అల్ జబర్

ఖతార్ ఎయిర్‌వేస్ కనెక్టివిటీ పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తుందని చెప్పారు. అమరావతిలో ఖతార్ దేశ కార్యాలయాన్ని ఏర్పాట చేసే అంశాన్ని పరిశీలించాలని రాయబారిని సీఎం చంద్రబాబు కోరారు.



విశాఖపట్నం, నవంబర్ 13: (విజన్ ఆంధ్ర)

సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భారత్‌లో ఖతార్ రాయబారి మహ్మద్ హసన్ జబీర్ అల్ జబీర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భవిష్యత్ ప్రాజెక్టులపై ఇరువురు చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, లాజిస్టిక్స్ పార్కులు, హాస్పిటాలిటీ రంగాల్లో అత్యుత్తమ ప్రాజెక్టులు ఉన్నాయని హసన్ అల్ జబీర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఎయిర్‌లైన్స్ రంగంలో ఖతార్ అత్యంత ప్రీమియం సేవలను అందిస్తోందని అన్న పేర్కొనగా... భారత్-ఖతార్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని, రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా కల్చర్‌తో పాటు ఫుడ్ ఇండస్ట్రీలోనూ అత్యుత్తమ నాణ్యతను అందిస్తున్నామని సీఎం వివరించారు. సాంకేతికతను వినియోగించుకుని రాష్ట్రంలో సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. భారత్‌లో పెట్టుబడులకు ఖతార్ ఆసక్తి చూపడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల అభివృద్ధి పట్ల తమ విజన్‌ను అభినందించినందుకు రాయబారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని పోర్టులు, పెట్రో కెమికల్ ప్లాంట్లు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు ఖతార్ సహకారం అందించాలని కోరారు.



ఖతార్ బృందం త్వరలో ఏపీ పర్యటన : హసన్ అల్ జబీర్

గతంలో భారత్‌లో ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు ఖతార్ ఆసక్తి ప్రకటించిందని రాయబారి మహ్మద్ హసన్ అల్ జబీర్ సీఎం చంద్రబాబుతో అన్నారు. ఏపీలో ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రాజక్టులు, భవిష్యత్ ప్రణాళికలపై మీర ఇచ్చిన ప్రజెంటేషన్లు అద్భుతంగా ఉన్నాయని సీఎం చంద్రబాబును ప్రశంసించారు. ఖతార్ నుంచి అధికారిక బృందం త్వరలోనే ఏపీలో పర్యటిస్తుందని హామీ ఇచ్చారు. ఇతర దేశాల్లో పనిచేస్తోన్న ఖతార్ కంపెనీలు ఏపీలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఖతార్ ఎయిర్‌వేస్ కనెక్టివిటీని దేశంలోని వివిధ నగరాలకు పెంచే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ఇప్పటికే ముంబైలో విజిట్ ఖతార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇటువంటి కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని రాయబరి వివరించారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక

20,000 హెక్టార్ల లక్ష్య సాధనకు వేగంగా అమలు చేయాలని ఆదేశం

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్





సూక్ష్మ సేద్య సంస్థల రాష్ట్ర స్థాయి ప్రతినిధులతో ఏపీఎంఐపీ పురోగతిపై కలెక్టర్ సమీక్ష

పుట్టపర్తి నవంబర్ 13((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)

శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఈరోజు సూక్ష్మ సేద్య కంపెనీల ప్రతినిధులతో సమావేశమై, శ్రీ సత్యసాయి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) పురోగతిని సమీక్షించారు.

సాగునీటిని పొదుపు చేయడానికి, ఉద్యాన, వ్యవసాయ, పత్తి పరిశ్రమ పంటల్లో అధిక ఉత్పత్తి సాధించడానికి ఏపీఎంఐపీ ని 2003లో ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారు 75,000 హెక్టార్లు బిందు, తుంపర సేద్యం కింద కవర్ అయ్యాయి. జిల్లాలో ఇంకా 70,000 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేపట్టేందుకు అవకాశం ఉంది. 2022-23 నుండి 2025-26 వరకు సూక్ష్మ సేద్యంలో జిల్లా రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచింది. 2025-26లో 11,781 యూనిట్లు (9,664 బిందు, 2,111 తుంపర) పూర్తయి, సుమారు 14,197 హెక్టార్లు కవర్ అయ్యాయి.

2026-27 సంవత్సరానికి తోలుత 12,100 హెక్టార్ల లక్ష్యం ఉండగా, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద దీనిని 20,000 హెక్టార్లకు పెంచారు. 34 కంపెనీల మొత్తం లక్ష్యం 19,950 హెక్టార్ల కు కాగా, ఇప్పటివరకు 4,282 హెక్టార్లకు పరిపాలనా అనుమతులు జారీ చేశారు; 3,032 హెక్టార్లకు డ్రిప్ పరికరాలు సరఫరా చేశారు.

పురోగతి పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, జాప్యానికి కింది కారణాలను పేర్కొన్నారు. పుట్టపర్తిలో కార్యాలయం ఏర్పాటు చేయకపోవడం,చాలా కంపెనీల సిబ్బంది అనంతపురం నుంచి పనిచేస్తుండటం,డీలర్ నెట్‌వర్క్ తగినంతగా లేకపోవడంతో దూరపు మండలాలకు చేరువ తక్కువగా ఉండటం. క్షేత్రస్థాయిలో సిబ్బంది తగినంత లేకపోవడం, నైపుణ్యం లేకపోవడం,సీజన్‌లో ఫీల్డ్‌లో కొరత,డ్రిప్ పరికరాలు సరఫరాలో ఆలస్యం, నిర్దేశిత గడువులు పాటించకపోవడం.క్షేత్రస్థాయిలో సరిగ్గా లేకుండా ఏర్పాటు చేయడం.ఆర్ ఎస్ కె.సిబ్బంది సహకరించకపోవడంలో తుది తనిఖీల్లో జాప్యం.

ఈ నేపథ్యంలో కలెక్టర్ కంపెనీలకు ఈ క్రింది ఆదేశాలు ఇచ్చారు.పుట్టపర్తిలోనే కార్యాలయాలు ఏర్పాటు చేసి, సిబ్బంది జిల్లాలోనే ఉండాలి.

దూరపు మండలాల్లో డీలర్ నెట్‌వర్క్‌ను విస్తరించాలి.శిక్షణ పొందిన క్షేత్ర సిబ్బందిని, తగినంత మంది ఫీల్డ్ సిబ్బందిని నియమించాలి.

నిర్దేశిత గడువులోగా డ్రిప్ పరికరాలు సరఫరా చేసి, తప్పులు లేకుండా ఏర్పాటు పూర్తి చేయాలి.

పెండింగ్‌లో ఉన్న అనుమతులను ప్రాధాన్యతతో చేపట్టాలి, ముఖ్యంగా ఇంకా పని ప్రారంభించని కంపెనీలు.

డ్రిప్ కంపెనీలు వారి గోడవును లు జిల్లా లో ఏర్పాటు చేసు కోవాలి. కాళీగా ఉన్న ప్రాథమిక సహకార సంఘాల గోదాములు డ్రిప్ పరికరాలు నిల్వకు వాడు కొనవలసినదిగా కోరారు.అలాగే, ఏపీఎంఐపీ కంపెనీలన్నీ తమ సామాజిక బాధ్యత (సీస్సార్) కార్యక్రమాల ద్వారా, రాష్ట్ర ప్రభుత్వ P4 (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) కార్యక్రమంలో భాగస్వాములలై



జిల్లా అభివృద్ధిలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలి.చిల్డ్రన్ హోమ్స్ (బాలల సంరక్షణ గృహాలు) అభివృద్ధికి సహకరించాలి.టీబీ ముక్త్ భారత్, నిక్షయ్ మిత్ర కార్యక్రమాల ద్వారా క్షయ రోగులకు చేయూత నివ్వాలి. సాంఘిక సంక్షేమ / బీసీ సంక్షేమ హాస్టళ్లను దత్తత తీసుకుని, వాటిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పడాలి.ఎ ఎం ఐ పి తుది తనిఖీలను వేగంగా పూర్తి చేయాలి. ఆర్ ఎస్ కె.సిబ్బంది పూర్తిగా సహకరించాలని అధికారులను ఆదేశించారు. పనితీరు చూపని కంపెనీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో ఎపిఎంఐపి పిడి దేవనంద్ కుమార్,బిసి సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి మరియు35 MI కంపెనీల రాష్ట్రస్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

హైకోర్ట్ తీర్పు హర్షనీయం : బుక్కే శివా నాయక్



తిరుపతి, నవంబర్ 13((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

హాథీరాం బావాజీ మఠం భూముల ఆక్రమణలపై గురువారం హైకోర్టు తీర్పు హర్షనీయమని తిరుపతి శ్రీ హాథీరాం బావాజీ ఆలయ ట్రస్ట్ చైర్మన్ బుక్కే శివా నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. తిరుపతి మంచినీళ్ల గుంట వెనుక వైపు ఉన్న మఠం భూముల స్థలంలో బుక్కే శివా నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం హథీరాం బావాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టెంకాయలు కొట్టడం జరిగింది. ఈ సందర్భంగా శివానాయక్ మాట్లాడుతూ సర్వే నంబర్ 942ఏ లోని 2.7 ఎకరాలు కల్గిన మంచినీళ్ళగుంట వెనక ఉన్న ఈ హాథీరాం బావాజీ మఠంలో విద్యాబోధన కని మూడు దశాబ్దాల ముందు లీజ్ కు తీసుకుని, ఇప్పటికీ తమదే ఈ స్థలమని కోర్టుకెక్కిన ఆక్రమణదారులపై హైకోర్టు గురువారం కేసు కొట్టి వేయడం జరిగిందన్నారు. అసలు ఏమాత్రం లీజు దారులకు సంబంధంలేని వ్యక్తికి గత ఏడాది దేవాదాయశాఖ జారీ చేసిన ప్రొసీడింగ్స్ ను హైకోర్టు గురువారం సస్పెండ్ చేసిందన్నారు. వెంటనే మఠం అధికారులు ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొని మఠం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా హాథీరాం బావాజీ ఆస్తులను కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తామని శ్రీ హాథీరాం బావాజీ ఆలయ ట్రస్ట్ చైర్మెన్ బుక్కె శివా నాయకు స్పష్టం చేసారు.

అల్పపీడనం పట్ల అప్రమత్తంగా ఉండాలి



గుంటూరు, నవంబరు 13 ((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన

అల్పపీడనం పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయవ్య దిశగా పయనించి శనివారం సుస్పష్టమైన అల్పపీడనంగా, ఆదివారం ఉదయానికి అదే ప్రాంతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. తదుపరి ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ సోమవారం సాయంత్రానికి మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉందని ఆర్.టి.జి.ఎస్ సూచనలు జారీ చేసిందని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల రీత్యా ప్రజలు ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పంటలు నష్టపోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు అందించాలని ఆదేశించారు.

పెళ్లికి ముందు యువత స్వచ్ఛందంగా హెచ్.ఐ.వి. పరీక్షలు చేయించుకోవాలి

- ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షల సంఖ్యను పెంచాలి
- జిల్లాలో ఎక్కడా రక్తపు కొరత తలెత్తకుండా బ్లడ్ బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలి
- శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి నవంబర్ 13((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు యువతీ యువకులు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెచ్.ఐ.వి నిర్ధారణ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్.ఐ.వి నియంత్రణ చర్యలు, రక్తనిధి కేంద్రాల పనితీరుపై ఆయన సమీక్షించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. పెళ్లికి ముందు హెచ్.ఐ.వి. పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై యువతలో విస్తృత అవగాహన కల్పించాలి. ఇందుకోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆకర్షణీయమైన గోడ పత్రికలను రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లాలి. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోనూ, అలాగే హెచ్.ఐ.వి. ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల (NGOs) సహకారంతో పరీక్షలను మరింత ముమ్మరం చేయాలి. ఇప్పటివరకు గుర్తించని బాధితులను పరీక్షల ద్వారా గుర్తించి, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ వెంటనే మెరుగైన చికిత్స (ART) అందేలా చర్యలు తీసుకోవాలి.సుఖవ్యాధి చికిత్సా కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడాలి. ఈ కేంద్రాలకు చికిత్స నిమిత్తం వచ్చే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా హెచ్.ఐ.వి. పరీక్షలు నిర్వహించాలి.జిల్లాలోని రక్తనిధి కేంద్రాలు (బ్లడ్ బ్యాంకులు) అవసరమైన మేరకు రక్తనిల్వలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి. జిల్లాలో ఎక్కడా రక్తం కొరత అనే మాట వినిపించకూడదు. ఇందుకోసం ప్రతి రక్తనిధి కేంద్రం తరచుగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను,రక్త నిర్ధారణ క్యాంపులను నిర్వహించాలి.ఐసిడిఎస్, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, కార్మికులు మరియు అవసరమైన వర్గాలందరికీ హెచ్.ఐ.వి. పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలి.

అంతకుముందు,జిల్లా లెప్రసీ,ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి (DLO) డాక్టర్ అనుపమ జేమ్స్ జిల్లాలో అమలవుతున్న హెచ్.ఐ.వి నియంత్రణ కార్యక్రమాల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ప్రమీల, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్,జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ జీ.వి. రమణ, హిందూపురం బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డా. లక్ష్మీ ప్రసాద్, బత్తలపల్లి ఏ.ఆర్.టి. (ART) కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హిమచంద్ర పాల్గొన్నారు. వీరితో పాటు సిబ్బంది ఈ.వి. రమణ, నారాయణ స్వామి, డీఆర్‌పీ రమేష్ మరియు ఫోర్డ్, చైతన్య, జనజాగృతి, దిశ, శక్తి మైత్రి మహిళా సంఘం ప్రివెన్షన్ యూనిట్ల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

ఘనంగా బాలల దినోత్సవం మరియు FES చిత్రలేఖనం పోటీలు



గాండ్లపెంట, నవంబర్ 13((విజన్ ఆంధ్ర) విలేకరి)

స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాండ్లపెంట యందు ప్రధానోపాధ్యాయులు శ్రీ ప్రసాద్ అధ్యక్షతన ఘనంగా ముందస్తు జవహర్ లాల్ నెహ్రూ మొదటి భారత ప్రధాని జయంతి బాలల దినోత్సవం మరియు FES చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కొరకు దేశం లోని 14 రాష్ట్రాలలో పాటుపడుతున్న FES స్వాచంద సంస్థ శుక్రవారం పర్యావరణం పై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో 73 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి , ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థి కి ప్రోత్సాహక బహుమతి సంస్థ ప్రతినిధులు సుభాషిణి , నాగమణి అందచేశారు. అనంతరం విద్యార్థులకు జవహర్ లాల్ నెహ్రూ గారి మహోన్నత కార్యాలను ఉపాధ్యాయులు వివరించారు. భారత దేశంలో నీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు కట్టిన ఘనత నెహ్రూ కు దక్కుతుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నప్పయ్య, మురాద్ వలి, లక్ష్మీ నారాయణ రెడ్డి,ఉమ మహేశ్వర, హరిప్రసాద్, రాజశేఖర్, పరిమళ, తాహిర్ వలి, నాగ శేషు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓలాపై రూ.10 లక్షల జరిమానా

మొదటిపేజీ తరువాయి

ప్రయాణం పూర్తికాకముందే అదనపు చెల్లింపులు చేయాలని ప్రయాణికులను ప్రోత్సహించే విధానాన్ని అనుసరించినందుకు ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఓలాపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) రూ.10 లక్షల జరిమానా విధించింది. ఈ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని ఓలాను ఆదేశించింది. ప్రయాణికులను తప్పుదోవ పట్టించే ఈ విధానం అన్యాయమైన వ్యాపార పద్ధతిగా, గందరగోళానికి కారణమయ్యేదిగా ప్రాధికార సంస్థ పేర్కొంది.ఓలా నిర్వహణ సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తన అనువర్తనంలో 'టిప్' లేదా 'అదనపు చెల్లింపు' పేరుతో ప్రయాణానికి ముందే వినియోగదారుల నుంచి అదనపు మొత్తాన్ని కోరుతోంది. డ్రైవర్ కోసం అన్వేషణ జరుగుతున్న సమయంలో ఈ సూచనలు కనిపించేవి. అదనపు మొత్తం చెల్లిస్తే త్వరగా వాహనం లభించే అవకాశాలు పెరుగుతాయన్న భావనను కలిగించేవి. ఈ అంశంపై విచారణ జరిపిన సీసీపీఏ, ఓలా విధానంలో పారదర్శకత లోపించిందని తేల్చింది.సీసీపీఏ ప్రధాన కమిషనర్ నిధి ఖరే, కమిషనర్ అనుపమ్ మిశ్రా నేతృత్వంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఓలా తొలుత ఈ సదుపాయాన్ని 'టిప్'గా పేర్కొనగా, ఆ తరువాత 'యాడ్-ఆన్'గా పేరు మార్చింది. అయితే పేరు మారినప్పటికీ, ప్రయాణానికి ముందే అదనపు చెల్లింపులను ప్రోత్సహించే అసలు విధానంలో మార్పు లేదని ప్రాధికార సంస్థ గుర్తించింది.అదనపు చెల్లింపులతో త్వరిత ప్రయాణం అన్నది తప్పుదారి పట్టించే సూచన

ఓలా సంస్థ స్వయంగా అందించిన 2026 జూన్ 1 నుంచి 15 వరకు ఉన్న ప్రయాణ అభ్యర్థనల గణాంకాలు కూడా ఈ వాదనకు మద్దతు ఇవ్వలేదని ప్రాధికార సంస్థ వెల్లడించింది.

నగరం అదనపు చెల్లింపుతో ప్రయాణ అంగీకారం అదనపు చెల్లింపు లేకుండా ప్రయాణ అంగీకారం

ఢిల్లీ	38 శాతం	62 శాతం
బెంగళూరు	40 శాతం	68 శాతం
ముంబై	39 శాతం	68 శాతం

ఓలా ఇచ్చిన ప్రయాణ అభ్యర్థనలను ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ ఎండీ భవిష్ అగర్వాల్ ఎక్స్ వేదికగా ధ్రువీకరించారు. ఈ ఫీచర్ ఇప్పటికే ఢిల్లీ, బెంగళూరు, ముంబై నగరాల్లో అందుబాటులో ఉందని ఆయన తెలిపారు.

ప్రయాణానికి ముందే టిప్ కోరడం అన్యాయమైన వ్యాపార విధానం

సాధారణంగా టిప్ అనేది సేవ పూర్తయిన తరువాత స్వచ్ఛందంగా ఇచ్చే అదనపు మొత్తం. అయితే ప్రయాణం ప్రారంభం కాకముందే టిప్ కోరడం ద్వారా స్వచ్ఛంద చెల్లింపును సేవకు ముందస్తు చెల్లింపుగా మార్చినట్లు సీసీపీఏ అభిప్రాయపడింది. 'టిప్' పేరును 'యాడ్-ఆన్'గా మార్చడం వల్ల ఈ విధానం స్వభావం మారదని స్పష్టం చేసింది.ప్రయాణికులు ఇప్పటికే ముందస్తు చార్జీ చెల్లించి వాహనాన్ని బుక్ చేసుకున్నారని, ఆ చార్జీలో రద్దీ సమయాల ధరలు, ప్రయాణికుడి అదనపు చెల్లింపులు చేసిన ప్రయాణ అభ్యర్థనలను డ్రైవర్లు తక్కువగా అంగీకరించినట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని సీసీపీఏ పేర్కొంది. ఒకవైపు అదనపు చెల్లింపులు ప్రయాణ కేటాయింపుపై ప్రభావం చూపవని ఓలా చెబుతుండగా, మరోవైపు త్వరగా వాహనం లభించే అవకాశాలు పెరుగుతాయని అనువర్తనంలో సూచించడం పరస్పర విరుద్ధమని పేర్కొంది.అదనపు చెల్లింపులు చేసిన అభ్యర్థనలకు తక్కువ అంగీకార రేటు ఉన్న విషయాన్ని వినియోగదారులకు తెలియజేయలేదని, సూచించిన మొత్తాలను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో వెల్లడించలేదని ప్రాధికార సంస్థ గుర్తించింది. ఈ విధంగా కీలక సమాచారాన్ని దాచిపెట్టడం వినియోగదారుల రక్షణ చట్టం, 2019లోని సెక్షన్ 2(28)(iv) పరిధిలోకి వస్తుందని తెలిపింది.

ప్రయాణికుల్లో భయాందోళనలు

కలిగించేలా అనువర్తన రూపకల్పన

భ్రమపరిచే రూపకల్పనల నివారణ, నియంత్రణకు సంబంధించిన 2023 మార్గదర్శకాల ప్రకారం కూడా సీసీపీఏ ఈ వ్యవహారాన్ని పరిశీలించింది. డ్రైవర్ ప్రయాణ అభ్యర్థనను అంగీకరించేందుకు వేచి ఉన్న సమయంలో అదనపు చెల్లింపు చేస్తే వాహనం లభించే అవకాశాలు పెరుగుతాయని సూచించడం ద్వారా, చెల్లించని వారికి ఆలస్యం కావచ్చని లేదా వాహనం దొరకకపోవచ్చని భావించే పరిస్థితి కల్పించిందని పేర్కొంది.దీంతో వినియోగదారుల్లో భయాన్ని, ఒత్తిడిని సృష్టించే 'కన్ఫర్మ్ షేమింగ్' విధానాన్ని ఉపయోగించి నట్లుగా సీసీపీఏ గుర్తించింది. ఇది 2023 మార్గదర్శకాల అనుబంధం1లోని మూడో నిబంధనకు విరుద్ధమని తెలిపింది.అనువర్తనంలో ముందుగానే నిర్దేశించిన చెల్లింపు మొత్తాలను చూపించడం వల్ల వినియోగదారులకు పరిమిత ఎంపికలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, "ఉదారమైన యాడ్-ఆన్" వంటి సందేశాలు అదనపు చెల్లింపులను మరింత ప్రోత్సహించాయని పేర్కొంది. సూచనలను తొలగించుకునేందుకు స్పష్టమైన అవకాశం కూడా లేదని తెలిపింది.ప్రయాణం బుక్ అయిన తరువాత, డ్రైవర్ అంగీకారం కోసం వేచి ఉన్న సమయంలో ఈ సూచనలు కనిపించేవి. ఆ సమయంలో డ్రైవర్ అందుబాటు లేదా అదనపు చెల్లింపుల ప్రభావంపై ప్రయాణికులకు పరిమిత సమాచారం మాత్రమే పేర్కొంది.

ఓలాకు సీసీపీఏ ఆదేశాలు

సీసీపీఏ ఓలాకు పలు ఆదేశాలు జారీ చేసింది. ప్రయాణం పూర్తికాకముందు ముందస్తు చార్జీకి అదనంగా టిప్, యాడ్-ఆన్, అదనపు రుసుము లేదా మరే ఇతర పేరుతోనైనా చెల్లింపును కోరే అన్ని సూచనలు, సందేశాలు, ముందస్తుగా నిర్ణయించిన మొత్తాలు, అనువర్తన రూపకల్పనలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది.వినియోగదారుల రక్షణ చట్టం2019, భ్రమపరిచే రూపకల్పనల నివారణ, నియంత్రణ మార్గదర్శకాలు2023, తప్పుదారి పట్టించే ప్రకటనల నివారణ మార్గదర్శకాలు2022లను కచ్చితంగా అమలు చేయాలని సూచించింది. అలాగే రూ.10 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది.ఇదే తరహా విధానంపై ఇతర క్యాబ్ సేవల సంస్థలపైనా సీసీపీఏ చర్యలు చేపట్టింది. గతంలో రాపిడో నిర్వహణ సంస్థ రోపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై రూ.10 లక్షల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏకగ్రీవ పంచాయతీ లకు ప్రభుత్వం ప్రోత్సాహం

కదిరి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

మండల ప్రజలకు తెలియజేయడం ఏమనగా ప్రస్తుతం జరుగుతున్న 2 nd సాధారణ ఎన్నికలు, గ్రామ పంచాయతీ లు రాష్ట్ర వ్యాప్తంగా 03 విడతలలో జరుగుచున్నవి. పై ఎన్నికల నిమిత్తము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు ఏకగ్రీవము అయిన గ్రామ పంచాయతీ (సర్పంచు మరియు వార్డు సభ్యులు) మొత్తము అయిన యెడల ప్రోత్సాహకము ప్రకటించడము జరిగినది. జనాభా వారీగా గ్రామ పంచాయతీ కి ఎంత ఇవ్వడము జరుగునో కింద పొందుపరచడము జరిగినది.

1. 2000 జనాభా లోపల :- 5,00,000-00
2. 2001 నుండి 5000 జనాభా వరకు :- 10,00,000-00
3. 5001 నుండి 10000 జనాభా వరకు :- 15,00,000-00
4. 10000 జనాభా పైన :- 20,00,000-00

పై విషయమై అందరూ మండల ప్రజలకు మరియు వివిధ పార్టీ అభ్యర్థులకు వున్న విషయము పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం అయినదని కె. పొలప్ప, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, మండల ప్రజా పరిషద్, కదిరి.ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం



కదిరి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

ఏపిఎస్ ఆర్టీసీ లో పదవీ విరమణ చేసిన, రిటైర్డు అయినాక చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు మరియు కరువు భత్యం బకాయిలపైన రావలన గ్రాట్యూటి,ఆర్జిత లీవుల వ్యత్యాసం ను సాధించుటకై విశేష కృషి చేస్తున్న కదిరి డిపో పదవీ విరమణ ఉద్యోగుల సంక్షేమ సంఘను ప్రధాన సలహదారుడు మోక హరిమోహన్ ను శుక్రవారం రిటైర్డు సీనియర్ కండక్టరు, రజక సంఘము నాయకుడు సి.నారయణప్ప పూలహారం,శాలువ తో సన్మానం చేసినారు. పెండింగ్ లో వున్న పించన్లను ఇప్పించడము, ఉద్యోగులకు ఆర్టీసీ నుండి రావలసిన న్యాయమైన బకాయిలు ఇప్పించడము, ఉద్యోగి కుటుంబాలకు కారుణ్యనియమకాలపైన అత్యంత శ్రద్ద పెట్టడము, వలన నేడు కదిరి డిపో పరిధిలో ఎంతో మందికి లబ్ది చేకూరినది నారయణప్ప తెలిపారు. ఈ కార్యక్రమములో నాయకులు పి.వి.ఎస్ నారాయణ, రామచంద్ర, బాష, నాగేశ్వరరావు తదితరులు పాల్గోన్నారు.

పోషణ్ ట్రాకర్ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1515 వినియోగించుకోండి

ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల

పుట్టపర్తి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

శ్రీ సత్యసాయి జిల్లా లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం, బాలామృతం, గుడ్లు, పాలు తదితర సేవలు సక్రమంగా అందకపోయినా, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులు ఉన్నా, 1515 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి తెలియజేయవచ్చని ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల తెలిపారు. పోషణ్ ట్రాకర్‌కు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు, ఈ 1515 నంబర్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఈ సదుపాయాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రజారాజధాని అమరావతిలో ఒబెరాయ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఫైవ్ స్టార్ లగ్జరీ హోటల్ ఏర్పాటు!



విశాఖపట్నం, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

విశాఖపట్నంలో శుక్రవారం జరిగిన 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో అమరావతిలో ఫైవ్ స్టార్ లగ్జరీ హోటల్ ఏర్పాటుకు సంబంధించి ఏపీ సి ఆర్ డి ఎ , ఈఐహెచ్ లిమిటెడ్ (ఒబెరాయ్ హోటల్స్) మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

ఈ ప్రాజెక్టు ద్వారా రూ.174 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. యువతకు 150 ప్రత్యక్ష ఉద్యోగాలు, మరో 250 పరోక్ష ఉద్యోగ అవకాశాలు అమరావతిలో కలగనున్నాయి.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఒప్పందాన్ని ఏపీ. సి ఆర్ డి ఎ.కమిషనర్ వి. విజయ రామరాజు ఐఏఎస్ , ఈఐహెచ్ లిమిటెడ్ ప్రతినిధులు పరస్పరం మార్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, పొంగూరు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ ఐఏఎస్, ఏపీ ఈడీబీ సీఈఓ షాన్ మోహన్ ఐఏఎస్, APCRDA అదనపు కమిషనర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఐఏఎస్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

నవంబర్ 26న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు

బాపట్ల, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

బాపట్ల పురపాలక సంఘం పరిధిలో చైర్‌పర్సన్ మరియు 44 మంది వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి మున్సిపల్ కార్యాలయం నవంబర్ 12 న ఎన్నికల ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నట్లు బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎం. హాసిని ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 14వ తేదీ శనివారం వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శించడంతో పాటు ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. అదే రోజు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. నవంబర్ 16వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి అవకాశం కల్పించారు. దాఖలైన నామినేషన్లను నవంబర్ 17వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల నుండి అధికారులు పరిశీలిస్తారు.

నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 19వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అనంతరం నవంబర్ 26వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఏవైనా కారణాలతో అవసరమైతే నవంబర్ 27వ తేదీ శుక్రవారం రీ-పోలింగ్ నిర్వహిస్తారు. చివరగా నవంబర్ 30వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నట్లు కమిషనర్ హాసిని పేర్కొన్నారు.

గెలుపోటముల కంటే ప్రజాస్వామ్యమే ముఖ్యం

:కదిరిలో కందికుంట ప్రసాద్ కొత్త రాజకీయ శైలి!

- **గతంలో జరిగిన ఎన్నికలు వేరు... ఇప్పుడు జరిగిన ఎన్నికలు వేరు!**
- **కదిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ మార్క్!**

కదిరి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో 2026లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఏ విధంగా జరిగాయో అందరికీ తెలిసిందే. పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాల వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగడం విశేషం. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో విజయవంతమయ్యారని వైసీపీ ముఖ్య నాయకులే అభిప్రాయపడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

కదిరి నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. నియోజకవర్గ పరిధిలోని ఆరు జడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగు స్థానాలను (కదిరి రూరల్, గాండ్లపెంట, తలుపుల, నంబులపూలకుంట) కైవసం చేసుకోగా, తెలుగుదేశం పార్టీ రెండు స్థానాల్లో (తనకల్లు, నల్లచెరువు) విజయం సాధించింది. సాధారణంగా అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు తమ రాజకీయ ఉనికిని మరింత బలోపేతం చేసుకునేందుకు జడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటారు. అవసరమైతే అధికారాన్ని ఉపయోగించి గెలుపు కోసం వ్యూహాలు రచిస్తుంటారు. కానీ కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ మాత్రం భిన్నమైన రాజకీయ విధానాన్ని అనుసరించారనే చర్చ జరుగుతోంది.

ప్రజల మనసుల్లో ఏముంది? ప్రతి ఓటరు మన పాలన గురించి ఏమనుకుంటున్నారు? ఏ బూత్‌లో మనకు బలం ఉంది? ఏ గ్రామంలో బలహీనంగా ఉన్నాం? ఏ మండలంలో ప్రజల మద్దతు తగ్గింది? నాయకుల పనితీరు ఎలా ఉంది? ఇంకా ఎక్కడ అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది? అనే అంశాలను తెలుసుకునే దిశగా ఎన్నికలను ఒక అవకాశంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పంలో సైతం ఒక ఎంపీటీసీ స్థానాన్ని వైసీపీ గెలుచుకున్న విషయం తెలిసిందే. ప్రజాస్వామ్యంలో



గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును గౌరవించడమే నిజమైన నాయకత్వమని చెప్పే విధంగా ఈ ఎన్నికల ఫలితాలు నిలుస్తున్నాయి.

అదే తరహా రాజకీయ వ్యూహాన్ని కదిరిలోనూ అనుసరిస్తూ ప్రజల మన్ననలు పొందే దిశగా ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ అడుగులు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏది ఏమైనా.. ఈ ఎన్నికల్లో గెలుపు కంటే ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యత ఇచ్చి, తనదైన రాజకీయ ముద్రను చూపించిన కందికుంట ప్రసాద్ మార్క్ స్పష్టంగా కనిపించిందనే చెప్పాలి..!.

గోవింద రెడ్డి వ్యక్తిత్వం ఏంటో ప్రజలకు తెలుసు బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

వై ఎస్ ఆర్ కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలో గత 25 ఏళ్లుగా ఎటువంటి కక్షలు, కార్పన్యాలు లేకుండా సుపరిపాలన అందించిన ఎమ్మెల్సీ గోవింద రెడ్డి వ్యక్తిత్వం ఏమిటో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా పేర్కొన్నారు.ఇటీవల టిడిపి నేతలు ఎమ్మెల్సీ గోవింద రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. శుక్రవారం ఎన్జీవో కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఆమె మాట్లాడుతూ ఒకసారి ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్న నేత గోవింద రెడ్డి ఆని అన్నారు.అందుకే గత 25 ఏళ్లుగా నియోజకవర్గంలోని ప్రజలు అన్ని ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అభ్యర్థులకు పట్టం కడుతూ వస్తున్నారని అన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో 2019- 2024 మధ్యకాలంలో మునుపెన్నడూ లేనివిధంగా బద్వేలు



నియోజకవర్గాన్ని రూ.400 కోట్లతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. బద్వేలు నియోజకవర్గ అభివృద్ధి, నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా గోవిందరెడ్డి పాలన అందించారని.. ఆ విషయం నియోజకవర్గంలోని ఏ ఒక్కరిని అడిగినా చెబుతారని అన్నారు. గడచిన 25 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలో ఏ ఒక్క ప్రతిపక్ష నేతనైనా గోవిందరెడ్డి ఇబ్బందుల గురిచేసారేమో, ఎన్నికలలో అక్రమాలకు అరాచకాలకు పాల్పడ్డారేమో తెలపాలని ప్రశ్నించారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారిగా సేవలు అందించిన ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా అదే హుందా తనంతో పాలన అందించారని ఏ ఒక్క ప్రభుత్వ అధికారిని కూడా తక్కువ చేసి మాట్లాడిన చరిత్ర లేదని అన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికలలో అప్రజాస్వామ్య విధానాలకు పాల్పడి, అరాచకాలు సృష్టించి ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను నామినేషన్ సైతం వేయకుండా అడ్డుకున్నారని అన్నారు.బద్వేలు నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ కంచుకోట అని ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు జరిగితే వైఎస్ఆర్ సీపీ అభ్యర్థుల విజయాన్ని ఎవరు కూడా ఆపలేరు అనే విషయాన్ని టిడిపి నేతలు గుర్తించాలని కోరారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించి గెలుపొందితే ఎవరి సత్తా ఏమిటో తెలుస్తుందని అన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు వైభవంగా ఏర్పాట్లు

పంచమి తీర్థం పడి ఊరేగింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

చేపట్టాలి : జేఈఓ డా. ఎ. శరత్

నవంబరు 20లోపు రథోత్సవ పనులు పూర్తి చేయాలి

తిరుపతి/తిరుచానూరు, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

తిరుచానూరులో కొలువై ఉన్న శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను వేగవంతం చేయాలని టీటీడీ జేఈఓ డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో సంబంధిత విభాగాల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ, అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రథోత్సవ ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి

అమ్మవారి ఆభరణాలు, వాహనాలు, బంగారు రథం శుభ్రపరిచే పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. రథోత్సవానికి సంబంధించి రథం చెక్క పనులు, పెయింటింగ్, చక్రాల ఫిట్‌నెస్ తదితర పనులన్నింటినీ నవంబరు 20వ తేదీలోపు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

డిసెంబరు 14న పంచమి తీర్థం పడి ఊరేగింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

పంచమి తీర్థం సందర్భంగా తిరుమల నుంచి ప్రారంభమయ్యే పడి ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జేఈఓ సూచించారు. ఈ ఊరేగింపులో సుమారు 60 కళాబృందాలు పాల్గొననున్న నేపథ్యంలో భక్తులకు విశేష ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుభూతిని కలిగించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పడి ఊరేగింపునకు సంబంధించి కోమలమ్మ సత్రం నుంచి ట్రయల్ రన్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలిపిరి నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయం వరకు రహదారుల మరమ్మతులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో చేపట్టాలన్నారు.

ఊరేగింపు మార్గంలో మామిడి తోరణాలు, అరటి చెట్లు, పందిళ్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందించేందుకు మార్గమంతా అనౌన్స్‌మెంట్లు, బ్రాడ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన వాహన సేవలు, ముఖ్య కార్యక్రమాలను ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జేఈఓ సూచించారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కార్తీక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని ఇంజినీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పారిశుద్ధ్యం, వైద్యం, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జేఈఓ సూచించారు.

అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి, పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలను భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక వేడుకగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.

ఈ సమీక్షలో సీఈ మనోహరం, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మల్లికార్జున ప్రసాద్, వీజీవో గిరిధర, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, గోశాల డైరెక్టర్ డా. శివకుమార్, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డా. కుసుమ కుమారి, అదనపు హెల్త్ ఆఫీసర్ డా. సునీల్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా

జిల్లా స్థాయి లఘు చిత్రాల పోటీలు మరియు బహుమతి ప్రదానోత్సవం



బాలికల సాధికారతే సమాజ సమగ్ర అభివృద్ధికి పునాది

శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

శుక్రవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ నంధు గల రెవెన్యూ భవన్ లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పుట్టపర్తి వారి నేతృత్వంలో జిల్లా స్థాయి లఘు చిత్రాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రథమ బహుమతి రూ. 30,000/-, ద్వితీయ బహుమతి రూ. 20,000/-, తృతీయ బహుమతి రూ. 10,000/- చొప్పున విజేతలకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా చెక్కుల రూపంలో అందజేయడం జరిగింది.

ఎస్.టి.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి ఎన్.ఎస్.ఎస్. యూనిట్లు-I & II సహకారంతో గతంలో సెప్టెంబర్ 29, 2026 న కళాశాలలో జిల్లా స్థాయి లఘు చిత్రాల పోటీలను నిర్వహించారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవం, సాధికారత మరియు లింగ సమానత్వంపై విద్యార్థుల్లో మరియు ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం.ఈ పోటీలలో ఎస్.టి.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కదిరి), ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (హిందూపురం), ఎస్.వై.టి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మడకశిర), మరియు ఎస్.ఎస్.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బుక్కపట్నం) కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ లఘు చిత్రాలను ప్రదర్శించారు. బాలికల విద్య, సాధికారత, బాల్య వివాహాల నిర్మూలన,లింగ వివక్ష నివారణ, భ్రూణ హత్యలు మరియు ఆడపిల్లల పట్ల వివక్ష నివారణ, బాలికల రక్షణ, మానవ అక్రమ రవాణా వంటి పలు సామాజిక అంశాలపై విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

న్యాయమూర్తులు లఘు చిత్రాల ప్రాధాన్యత, సృజనాత్మకత, సామాజిక సందేశం, సాంకేతిక నాణ్యత తదితర అంశాలను పరిశీలించి క్రింది విధంగా విజేతలను ఎంపిక చేశారు.

ప్రథమ బహుమతి:ఎస్.టి.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరికి చెందిన ఎస్. బాషా – "సేవ్ ది గర్ల్ చైల్డ్" అనే అంశంపై రూపొందించిన లఘు చిత్రానికి ప్రథమ స్థానం లభించింది.

ద్వితీయ బహుమతి: ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హిందూపురానికి చెందిన ఎన్. గౌతమి – "బాలికల అక్రమ రవాణా" అనే అంశంపై రూపొందించిన లఘు చిత్రానికి ద్వితీయ స్థానం లభించింది.

తృతీయ బహుమతి:ఎస్.వై.టి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మడకశిరకు చెందిన పి. రజియా బాను – "ఆన్‌లైన్ సైబర్ నేరాలు" అనే అంశంపై రూపొందించిన లఘు చిత్రానికి తృతీయ స్థానం లభించింది.న్యాయమూర్తులు మరియు ముఖ్య అతిథులుఈ పోటీలకు ఎస్.టి.ఎస్.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా, పుట్టపర్తి వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. మహేశ్వర మారుతి, శ్రీ సత్యసాయి జిల్లా జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి సి. సుబ్రహ్మణ్యం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం. రామచంద్ర, ఆంగ్ల అధ్యాపకులు డా.టి.టి.పి.మోహన్ బాబు, ఐక్యూఏసీ సమన్వయకర్త డా. ఆర్. హైదర్ అలీ, డా. వి. చంద్రశేఖర్ నాయక్ తదితరులు న్యాయమూర్తులుగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎన్. ఫీరోజా బేగం, డాక్టర్ మహేశ్వర మారుతి, సీడీపీఓ జయంతి, డెమో సెక్షన్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్, కళాశాల ప్రిన్సిపాల్స్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ అధికారులు డా. ఎం. కృష్ణ నాయక్, ఎస్. యాసిన్ పీర్, అధ్యాపక సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు మరియు ఆరోగ్య సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు.

బాలికలను విద్యావంతులుగా, ఆత్మవిశ్వాసం గలవారిగా తీర్చిదిద్దినప్పుడే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని వక్తలు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ కవాతు

ఎన్నికల వేళ శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం



తెనాలి నవంబర్13 (విజన్ ఆంధ్ర)

రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రజల్లో భద్రతాభావం కల్పించేందుకు తెనాలి రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం కట్టేవరం, కొలకలూరు గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కవాతులో తెనాలి సబ్‌డివిజన్‌కు చెందిన 60 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా రూరల్ సీఐ నాయబ్ రసూల్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతోందన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఈ కవాతులో తెనాలి రూరల్ ఎస్సై ఆనంద్, కొల్లిపర ఎస్సై ప్రసాద్‌తో పాటు సబ్‌డివిజన్‌కు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేదికపై తెనాలి కీర్తిపతాక

కామన్వెల్త్‌లో రజత పతకంతో మెరిసిన మధిర షానూన్‌కు సత్కారం



తెనాలి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

కఠోర సాధనకు పట్టుదల తోడైతే విజయాలు వరిస్తాయని నిరూపిస్తున్న అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ మధిర షానూన్‌కు ఘన సత్కారం లభించింది. అంతర్జాతీయ పోటీల్లో ఇప్పటివరకు ఐదు పతకాలు సాధించడంతో పాటు ఇటీవల కామన్వెల్త్ పోటీల్లో రజత పతకం కైవసం చేసుకుని దేశ కీర్తిని చాటిన ఆమెను స్థానిక చెంచుపేటలోని మార్గ్ అపార్ట్‌మెంట్ మహిళా అసోసియేషన్ సభ్యులు గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. మధిర షానూన్ సాధించిన విజయాలు తెనాలి పట్టణానికే గర్వకారణమని పేర్కొన్నారు.అంతర్జాతీయ స్థాయిలో ఐదు పతకాలు సాధించడం, కామన్వెల్త్ పోటీల్లో రజత పతకాన్ని కైవసం చేసుకోవడం ఆమె కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు.క్రీడారంగంలో ఆమె ప్రస్థానం యువతులకు, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, తెనాలికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం షానూన్‌ను ఘనంగా సత్కరించి బహుమతిని అందజేశారు. ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మహిళా అసోసియేషన్ సభ్యులు శివరాణి, రమ్య, సౌజన్య, ఝాన్సీ, కుమారి, పద్మ, జయలక్ష్మితో పాటు షానూన్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

● అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు ● జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ



తెనాలి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

బియ్యం ధరల పెరుగుదలతో సామాన్య వినియోగదారులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ ధరలకే వ్యాపారులు బియ్యం విక్రయించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ స్పష్టం చేశారు. శుక్రవారం తెనాలి పట్టణంలోని పలు బియ్యం దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా బియ్యం ధరల నియంత్రణకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ మిల్లర్లు, వ్యాపారులతో చర్చించి వివిధ రకాల బియ్యానికి గరిష్ఠ చిల్లర ధరలను నిర్ణయించినట్లు తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ (సోనా, సాంబ), కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలు రూ.76, స్వర్ణ మసూరి రూ.47, జై శ్రీరామ్ రకం రూ.82 చొప్పున విక్రయించాలని సూచించారు. ఈ ధరల వివరాలను ప్రతి దుకాణంలో వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు.తనిఖీల్లో భాగంగా దుకాణాల్లో ధరల పట్టికలు ప్రదర్శిస్తున్నారా? ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా? అనే అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎవరైనా నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయించినా, ధరల వివరాలు ప్రదర్శించకుండా నిర్లక్ష్యం వహించినా అటువంటి వ్యాపారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు కూడా బియ్యం కొనుగోలు సమయంలో ధరలను గమనించాలని, అధిక ధరలు వసూలు చేస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోమలి పద్మ సూచించారు.

నిర్వహణ పనులతో విద్యుత్‌కు విరామం

కొలకలూరు, గుడివాడలో గృహ వినియోగదారులకు గంటపాటు కోత..

వ్యవసాయ విద్యుత్ షెడ్లకు మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేత

తెనాలి రూరల్ నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నేపథ్యంలో శనివారం తెనాలి రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. కొలకలూరు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని కొలకలూరు, గుడివాడ గ్రామాల్లో గృహ విద్యుత్ వినియోగదారులకు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఏపీసీపీడీసీఎల్ తెనాలి రూరల్ డివ్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు టేకి విశ్వనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అదేవిధంగా 11 కేవీ కొలకలూరు వ్యవసాయ విద్యుత్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా కొలకలూరు, గుడివాడ, ఖాజీపేట, అనమర్లపూడి, తంగెళ్లమూడి గ్రామాల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ షెడ్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు వివరించారు.వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

శానిటేషన్ పై ప్రణాళికాబద్ధంగా పని చేయండి

శానిటేషన్ అధికారులు, కార్పొరేటర్ల సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబర్ 13. (విజన్ ఆంధ్ర)

గుంటూరు నగరంలో శానిటేషన్ పై కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ అధికారులు ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు వెళ్లాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. స్థానిక తూర్పు కార్యాలయంలో శుక్రవారం శానిటేషన్ అధికారులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తడి చెత్త పొడి చెత్త సేకరించడంలో సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని చెప్పారు. చెత్త సేకరణకు అవసరమైన సామగ్రిని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు విడతల వారీగా సిల్ట్ తీత చేపట్టాలని సూచించారు తుఫాను కారణంగా లోతట్టు ప్రాంతాలలో చాలాచోట్ల నీళ్లు నిలిచాయని, ఇకపై ఇలాంటి సమస్య రాకుండా ప్రణాళికబద్ధంగా పని చేయాలని చెప్పారు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు తమ ప్రాంతాలలో శానిటేషన్ ఎలా ఉందో పరిశీలించుకోవాలని



సూచించారు ప్రజల వద్ద నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు ఏదైనా సమస్య తమ దృష్టికి వస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలోని పలు డివిజన్లలో చెత్త తరలింపులో జాప్యం, డ్రైనేజీల్లో పూడికతీత పనుల పట్ల ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించకూడదని, సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలని శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఇటీవలే కొలువుదీరిన కార్పొరేటర్లు తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అధికారులు కూడా కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ తక్షణమే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ నిర్వహించడం వంటి పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా పనిచేయాలని, ప్రధాన రహదారులతో పాటు అంతర్గత కాలనీల్లోనూ ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా చూడాలన్నారు.


జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు హోటళ్లు, రిసార్ట్స్, లాడ్జీలు ఇతర అతిథి గృహాలను విస్తృతంగా తనిఖీ చేసిన పోలీస్ అధికారులు

● చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి, పాత నేరస్థులను గుర్తించేందుకు విస్తృత తనిఖీలు

● ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించడమే లక్ష్యం : జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పనిచేస్తోందని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు తమ పరిధిలోని లాడ్జీలు, హోటళ్లు, రిసార్ట్స్, ఇతర అతిథి గృహాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు, వారు ఎక్కడి నుంచి వచ్చారు, ఏ కారణంతో అక్కడ బస చేస్తున్నారు తదితర అంశాలను క్షుణ్ణంగా విచారించారు. బస చేసే వారికి వివరాలు క్షుణ్ణంగా రిజిస్టర్లో నమోదు చేయాలని నిర్వాహకులను పోలీస్ అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే పంచాయతీ, బాపట్ల మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడంతో పాటు, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా



అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా లాడ్జీలు, హోటళ్లు, రిసార్ట్స్ లలో పోలీస్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారని తెలిపారు. తనిఖీల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు, వారి రాకకు గల కారణాలు, అక్కడ బస చేయడానికి గల అవసరాలను పరిశీలించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులు ఎవరైనా ఆశ్రయం పొందుతున్నారా, గతంలో వివిధ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడిన పాత నేరస్థులు ఎవరైనా ఉన్నారా, చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు ఏమైనా జరుగుతున్నాయా అనే అంశాలపై క్షుణ్ణంగా విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు



చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఉన్నా, చట్టవ్యతిరేక లేదా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదిలికలను గుర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ నంబర్ 8333813228 లేదా టోల్ ఫ్రీ నంబర్ 112కు సమాచారం అందించాలని ప్రజలను తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతామన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగులచవితి వేడుకలు..

పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్న భక్తులు

రేపల్లె, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన పర్వదినమైన నాగులచవితిని పురస్కరించుకుని శుక్రవారం రేపల్లె పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో సమీపంలోని నాగదేవత ఆలయాలు, పుట్టల వద్దకు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. పుట్టకు పసుపు, కుంకుమ రాసి, నూతన వస్త్రాలు సమర్పించి, పూలతో అలంకరించారు. ం

అనంతరం ఆవు పాలు, కోడిగుడ్లు, చలిమిడి, చిమ్మిలి, వడపప్పు, అరటిపండ్లను నైవేద్యంగా సమర్పించి పుట్టలో పాలు పోశారు. నాగదేవత ఆశీస్సులతో తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సంతాన ప్రాప్తి కలగాలని భక్తులు ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. ఈ



సందర్భంగా పట్టణంలోని ప్రముఖ శివాలయాలు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో అర్చకులు విశేష అభిషేకాలు, నాగ ప్రతిష్ట పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



చిన్నారులు టపాసులు కాల్చుతూ పండుగ వాతావరణంలో సందడి చేశారు. మొత్తంగా రేపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా నాగులచవితి వేడుకలు అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి.

భక్తిభావంతో నాగదేవతకు పూజలు

ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలి.. ఈదర వెంకట పూర్ణ చంద్

తెనాలి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

హిందూ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల్లో నాగారాధనకు విశిష్టమైన స్థానం ఉందని, నాగుల చవితి పర్వదినం భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుందని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదర వెంకట పూర్ణ చంద్ అన్నారు. నాగుల చవితిని పురస్కరించుకుని వైకుంఠపురంలోని ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగుల పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నాగదేవతకు పాలు, ప్రసాదాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఈదర వెంకట పూర్ణ చంద్ మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాగదేవతను భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయంలో పండుగలు, పర్వదినాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తులకు అందుబాటులో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆలయ కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ మాట్లాడుతూ.. హిందూ ధర్మంలో ప్రతి పండుగకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉందన్నారు. భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయంలో పర్వదినాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాగుల చవితి సందర్భంగా నాగదేవతకు పూజలు నిర్వహించి భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ధర్మకర్తల మండలితో కలిసి కృషి చేస్తున్నట్లు తెలిపారు.పూజారులు సత్యనారాయణ గౌతం, శ్రావణ్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, తవ్వా శివ నాగ ప్రసాద్, చాట్రాగడ్డ సుభాషిని, గిరిజావాణి,



చందర్లపాటి మౌనిక, చాట్రాగడ్డ ఆంజనేయులు, చందర్లపాటి సూర్య వెంకటేష్, నల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామాజిక స్పృహకు బీజం

ఎల్నినో ప్రభావాలు.. వాతావరణ మార్పులపై వ్యాసరచన పోటీలు

తెనాలి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

చిన్నతనం నుంచే విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తే భావితరాలు సమాజానికి దిశానిర్దేశం చేసే పౌరులుగా ఎదుగుతాయని సాయి మంగా సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కంకిపాటి రమేష్ కుమార్ అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు సమకాలీన సమస్యలపై చైతన్యం కల్పించడమే సంస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.భారతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎల్నినో ప్రభావాలు, వాతావరణ మార్పుల పర్యవసానాలు, ప్రకృతి విపత్తులు, వాటిని ఎదుర్కొనే ముందస్తు చర్యలు తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణ సమస్యలపై విద్యార్థులు స్వయంగా ఆలోచించి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేలా ఈ పోటీలు దోహదపడతాయన్నారు.ఎన్‌సీఆర్ఎన్ మున్సిపల్ పాఠశాల, కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ పాఠశాల, సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు వివరించారు. విజేతలకు ఈ నెల 15న కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించే బాలల దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.ఈ



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరై బహుమతులు ప్రదానం చేయనున్నారు. విశిష్ట అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం.ఆర్.ఎం.రావు, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ ముసగాల మోహన శ్యామ్ ప్రసాద్, శశి గ్రూప్స్ చైర్మన్ ఉప్పల వరదరాజులు, వరం లేటెక్స్ ఎండీ రామ్మోహనరావు, స్టార్ శ్రీనిధి బ్యాంక్ ఎండీ మాలేపాటి దుర్గాప్రసాద్, హ్యోపీ నర్సింగ్ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ పవని ప్రియాంక తదితరులు పాల్గొంటారని తెలిపారు.సాయి మంగా సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నామని రమేష్ కుమార్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరించి నిరుపేదలకు, విద్యార్థులకు అండగా నిలవాలన్నదే తమ సంకల్పమన్నారు. ఇందుకు దాతలు, ప్రజల సహకారం అవసరమని కోరారు.బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు పర్యావరణం, ప్రకృతి విపత్తులు, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు వారి భవిష్యత్తుకు పునాదులవుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం బాలల దినోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఓతుకోలు మార్కండేయులు, బొమ్ము రామకృష్ణారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.వి.రఘునాథరావు, సుంకర సాయి, గ్రంధి సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో అన్ని అక్రమాలే...

చేసిన అభివృద్ధి లేకనే ఇలాంటి దౌర్జన్యాలు

మంగళగిరి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులకు తగిన సమయం ఇవ్వకుండా నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారని బీసీవై అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. అధికార యంత్రాంగాన్ని తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉపయోగించుకున్నారని విమర్శించారు.అభ్యర్థులను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేసి నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, నామినేషన్లు వేసిన వారిని బలవంతంగా ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపించారు. మంగళగిరి బైపాస్ రోడ్డులోని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమాలు, మీడియా పక్షపాత ధోరణి, సామాజిక న్యాయం, 2029 ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి లక్ష్యం తదితర అంశాలపై మాట్లాడుతూ,ఎన్నికల ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని, మెజారిటీ సాధించిన అభ్యర్థులను కాదని తమకు అనుకూలమైన వారిని విజేతలుగా ప్రకటించుకున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీసీవై పార్టీ అభ్యర్థులు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఎన్నికల్లో పోటీకి ముందుకు వచ్చారని తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసి ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించడంతో పాటు ప్రభుత్వ విధానాలు, రాజకీయ అక్రమాలపై చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నించామని పేర్కొన్నారు. ఎన్నికల అక్రమాలపై ఎన్నికల సంఘానికి అనేక ఫిర్యాదులు అందజేశామని వెల్లడించారు.



తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు పరస్పర రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నాయని, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాటం చేయడంలో ప్రతిపక్షం విఫలమైందని విమర్శించారు. పుంగనూరు రాజకీయ పరిణామాలు, మున్సిపల్ చైర్మన్ పదవి కేటాయింపు వంటి అంశాలు రాజకీయ కుమ్మక్కుకు అయ్యారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించడం వల్ల నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని అన్నారు.రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు వర్గాలకు గత ఎనిమిది దశాబ్దాలుగా రాజకీయంగా సముచిత ప్రాధాన్యత లభించలేదని విమర్శించారు. కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల రాజకీయ ఆధిపత్యం వల్ల అధిక జనాభా కలిగిన వర్గాలు పాలనా బాధ్యతలకు దూరమయ్యాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, గృహ నిర్మాణాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రకటిస్తున్న లెక్కలు ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. సినిమా పరిశ్రమ, పారిశ్రామిక అభివృద్ధి పేరుతో విలువైన భూములు, వనరులను కొద్దిమంది ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

2029 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో కూడా బీసీ ముఖ్యమంత్రి రావడమే బీసీవై పార్టీ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు వర్గాలను ఏకం చేసి సామాజిక న్యాయం సాధించే దిశగా ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. దేశ వ్యాప్తంగా బీసీ కులగణన, రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల సాధన కోసం వివిధ రాజకీయ పార్టీలతో చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు.

మీడియా సంస్థలు పక్షపాత ధోరణిని విడనాడాలని బోడె రామచంద్ర యాదవ్ కోరారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి ప్రధాన పత్రికలు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. 2023 జూలై 23న నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా భారీ వర్షాలు, తుఫాను పరిస్థితుల మధ్య వేలాది మంది పాల్గొన్న బీసీవై పార్టీ ఆవిర్భావ కార్యక్రమానికి ఈనాడు పత్రికలో కనీసం జిల్లా సంచికలోనూ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. మరోవైపు ఇతర పార్టీల ఆవిర్భావ కార్యక్రమాలకు మొదటి పేజీలో ప్రాధాన్యత కల్పిస్తున్నారని ప్రశ్నించారు.

రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యలను వాస్తవికంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మీడియా సంస్థలకు సూచించారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు బలంగా ప్రజల్లోకి వెళ్తున్నాయని, ప్రజలు వాస్తవాలను తెలుసుకునే పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

బీసీవై పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం లో ప్రజా గ్రీవెన్స్



గుంటూరు, నవంబర్ 13. (విజన్ ఆంధ్ర)

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్లు ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వినతులు, అర్జీలు కార్పొరేటర్లు గుర్రం ప్రసాద్, బెజ్జం అనిల్, గంటా మౌళిక, తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీలలు స్వీకరించారు.ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాంటి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలియజేసారు.

బాపట్ల మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వివరాలు విడుదల



క్రమ సంఖ్య	నామినేషన్ వార్డుల సంఖ్య	నామినేషన్ వేసే స్థలం
1	ఛైర్‌పర్సన్ నామినేషన్	కౌన్సిల్ హాల్
2	1వ వార్డు నుండి 4వ వార్డు వరకు	మెప్మా విభాగము
3	5వ వార్డు నుండి 8వ వార్డు వరకు	టౌన్ ప్లానింగ్ విభాగము
4	9వ వార్డు నుండి 12వ వార్డు వరకు	జనన మరియు మరణ విభాగము
5	13వ వార్డు నుండి 16వ వార్డు వరకు	పరిపాలన విభాగము - దక్షిణం
6	17వ వార్డు నుండి 20వ వార్డు వరకు	పరిపాలన విభాగము - మధ్య
7	21వ వార్డు నుండి 24వ వార్డు వరకు	పరిపాలన విభాగము - ఉత్తరం
8	25వ వార్డు నుండి 28వ వార్డు వరకు	అకౌంట్స్ విభాగము
9	29వ వార్డు నుండి 32వ వార్డు వరకు	ఇంజనీరింగ్ విభాగము
10	33వ వార్డు నుండి 36వ వార్డు వరకు	డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విభాగము
11	37వ వార్డు నుండి 40వ వార్డు వరకు	శానిటేషన్ విభాగము
12	41వ వార్డు నుండి 44వ వార్డు వరకు	రెవిన్యూ విభాగము

అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి & కమిషనర్
బాపట్ల పురపాలక సంఘం

బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

బాపట్ల పురపాలక సంఘం పరిధిలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఛైర్‌పర్సన్, వార్డుల వారీగా నామినేషన్లు స్వీకరించే ప్రదేశాల వివరాలను అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి, మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో విడుదల చేశారు. అభ్యర్థుల సౌకర్యార్థం వివిధ విభాగాలలో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని వివిధ విభాగాల వారీగా కేటాయించిన నామినేషన్ స్థలాల వివరాలు ఇలా ఉన్నాయి: ఛైర్‌పర్సన్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు కౌన్సిల్ హాల్‌లో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇక వార్డుల వారీగా చూస్తే, 1 నుండి 4వ వార్డు వరకు మెప్మా విభాగంలో, 5 నుండి 8వ వార్డు వరకు టౌన్ ప్లానింగ్ విభాగంలో, 9 నుండి 12వ వార్డు వరకు జనన, మరణ విభాగంలో నామినేషన్లు స్వీకరిస్తారు. అదేవిధంగా 13 నుండి 16వ వార్డు వరకు పరిపాలన విభాగము - దక్షిణం, 17 నుండి 20వ వార్డు వరకు పరిపాలన విభాగము, మధ్య, 21 నుండి 24వ వార్డు వరకు పరిపాలన విభాగము - ఉత్తరం కేంద్రాలలో నామినేషన్లు వేయవచ్చు.

అదేవిధంగా 25 నుండి 28వ వార్డు వరకు అకౌంట్స్ విభాగంలో, 29 నుండి 32వ వార్డు వరకు ఇంజనీరింగ్ విభాగంలో, 33 నుండి 36వ వార్డు వరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విభాగంలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుంది. చివరగా 37 నుండి 40వ వార్డు వరకు శానిటేషన్ విభాగంలో, 41 నుండి 44వ వార్డు వరకు రెవెన్యూ విభాగంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వార్డులకు కేటాయించిన నిర్దిష్ట విభాగాలలోనే నామినేషన్ పత్రాలను సమర్పించాలని సూచించారు.

దోమతెరలతో దోమల నుంచి రక్షణ పొంది జ్వరాలు నుంచి విముక్తి పొందుదాం

: బాపట్ల జిల్లా మలేరియా అధికారి వి నాగార్జున రావు



బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

ఆంధ్ర ప్రదేశ్ కీటక జనిత వ్యాధులు నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర అదనపు సంచాలకుల కార్యాలయం నుంచి వచ్చిన హానికరం కానటువంటి స్వల్ప క్రిమి సంహారిణి పూత పూయబడిన దోమతెరలను బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ ఆదేశములతో శుక్రవారం బాపట్ల పట్టణం అక్బర్ పేటలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల కు దోమతెరలు పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ ఈ దోమతెరలు రెండు అంచెలుగా విద్యార్థులకు నిద్రించు సమయంలో రక్షణ కల్పిస్తాయని తెలియజేశారు. దోమతెర భౌతికంగా దోమ కాటు నుండి రక్షణ కలిగించడమే కాక, దానిమీద వాలిన దోమలకు దోమతెరపై అంటించి ఉన్న క్రిమినంహారకమందు దోమలను చంపగలుగుతుందని తెలియజేశారు. ఈ దోమతెర ప్రత్యేక మైన మెటీరియల్ తో తయారు చేయబడుతుందని మరియు దీర్ఘకాలం నిలిచి ఉంటుందని తెలియజేశారు. దీనిపైపూయబడిన క్రిమిసంహారిణి పూత మనుషులకు ఎలాంటి హాని కలిగించదని కేవలం దోమలపై మాత్రమే ప్రభావం చూపుతుందని తెలియజేశారు. ఈ దోమతెర లను 20 నుండి 25 సార్లు సాధారణ ఉతుకులతో వాడినను ప్రభావంతంగా ఉంటుందని తెలియజేశారు. వీటిని వేడి నీళ్లలో ఉతకరాదని, జాగ్రత్తగా వాడుకుని దోమ కాటు నుండి వచ్చే మలేరియా, డెంగి, చికున్ గున్యా వ్యాధుల నుండి రక్షణ పొందాలని తెలియజేశారు. ఈ దోమతెరల పంపిణీ



బాపట్లలోని బి ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల లో పంపిణీ చేసి అనంతరం వెదుళ్ళపల్లి ప్రభుత్వ బదిరుల పాఠశాలలో కూడా విద్యార్థుల కు కూడా పంపిణీ చేయడం జరిగింది. దోమతెరలు వాడే విధానం, మన్నిక గురించి అవగాహన కూడా కల్పించటం జరిగింది.

ఈ కార్యక్రమంలో బాపట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఏ వి పద్మావతి గారు,పట్టణ ఆరోగ్య కేంద్రం ప్యాడిసన్ పేట వైద్యాధికారి డాక్టర్ డి. వందన గారు,వెదుళ్లపల్లి పీహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ జి శిరీష గారు,ఇన్చార్జి సహాయ మలేరియాఅధికారి షేక్ ఖదీర్ ,సబ్ యూనిట్ అధికారి ఎండి షకిల్ ,పట్టణ మలేరియా సూపర్వైజర్ జే రాంబాబు, మహిళా హెల్త్ సూపర్వైజర్ ఎన్ సుధారాణి, మలేరియా కార్యాలయ ల్యాబ్ టెక్నీషియన్ సత్యం రాజు కూరపాటి , పట్టణ ఆరోగ్య కార్యకర్తలు పి. శేషగిరిరావు, ఎస్ వి రమణ, స్థానిక సచివాలయ ఏఎన్ఎం పి రూతు, ఆశా కార్యకర్త స్వాతి గారు పాల్గొన్నారులి

అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు

ప్రజాదర్బార్ లో అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబర్ 13. (విజన్ ఆంధ్ర)

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే నసీర్ నేరుగా అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. అనంతరం సంబంధిత అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, కూటమి నేతలు ప్రజల సమస్యలకు జవాబుదారీగా ఉంటారని చెప్పారు. స్థానిక నెహ్రూ నగర్ లోని ఎండోమెంట్ భూమిలో నివాసం ఉంటున్న వారికి నోటీసులు జారీ చేశారని తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమ వద్దకు వచ్చి న్యాయం చేయాలని అర్జీలు అందించారన్నారు. నగర కమిషనర్ తో సంప్రదించి బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జీవో నంబర్ 30 ద్వారా ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ చేస్తామని తెలిపారు. దీంతోపాటు పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన స్థాయిలో ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. వైజాగ్ లో సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించబోతున్నారని చెప్పారు.



సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్ ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చారని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ బిజినెస్ డూయింగ్ విధానం అమలు చేస్తున్నారని చెప్పారు. యువతకు లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం రెండున్నరేళ్లలో అన్ని ప్రాంతాలను సమాన స్థాయిలో అభివృద్ధి చేశామని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ఎక్కడెక్కడ డ్రెయిన్లు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ఇతర మౌలిక వసతులు అవసరమో గుర్తిస్తున్నామని, తమ కార్పొరేటర్ల ద్వారా ప్రతి సమస్యనూ పక్కా ప్రణాళికతో పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు ఎప్పుడు ఏ అవసరం ఉన్నా తమను నేరుగా సంప్రదించవచ్చని అన్నారు. గుంటూరు నగరాభివృద్ధికి తామంతా కలిసికట్టుగా ముందుకు వెళతామని తెలియజేసారు.

ఎన్నికల నిర్వహణకు ముందస్తు కసరత్తు!

అధికారులతో సమీక్ష.. పకడ్బందీ ఏర్పాట్లపై దృష్టి



తెనాలి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు2026ను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ముందస్తు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తెనాలి మండల పరిధిలోని పంచాయతీ అభివృద్ధి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు.ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటర్ల జాబితాల పరిశీలన, ఎన్నికల సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.

పోటీ చేసే ప్రతి డివిజన్‌లో జనసేన గెలుపే లక్ష్యం

చిల్లపల్లి శ్రీనివాసరావుతో వంగవీటి రాధాకృష్ణ భేటీ!

మంగళగిరితాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికలపై చర్చ

మంగళగిరి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి బలపరిచే జనసేన అభ్యర్థులందరినీ గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని జనసేన నేతలు చిల్లపల్లి శ్రీనివాసరావు, వంగవీటి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం మంగళగిరి జనసేన నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావును రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ మేయర్‌గా ఎన్నికైన రాధాకృష్ణకు చిల్లపల్లితో పాటు పార్టీ నాయకులు స్వాగతం పలికారు.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాలు, ప్రచారంలో పార్టీ శ్రేణుల కృషి, ప్రజల నుంచి లభించిన మద్దతుపై ఇరువురు నేతలు చర్చించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని కొనసాగిస్తూ, జనసేన పోటీ చేసే ప్రతి డివిజన్‌లో నాయకులు, జనసైనికులు, వీరమహిళలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఎన్నికల హామీల అమలు, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత



చేరువ చేయాలని అభిప్రాయపడ్డారు.

మరమ్మతుల పనులతో రేపు ఆరు గంటల పాటు విద్యుత్ కోత

తెనాలి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)



సబ్‌స్టేషన్ మరమ్మతులు, నూతన వీసీబీ ఏర్పాటు పనుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ తెనాలి టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బోరుగడ్డ అశోక్‌కుమార్ తెలిపారు.ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.సుల్తానాబాద్, సాయికుమార్ కాలనీ, సుందరయ్యనగర్, ఆలపాటినగర్, మార్కెట్ యార్డు, సుగాలి కాలనీ, సరళానగర్, జేఎంజే కళాశాల రోడ్డు, పినపాడు, పాండురంగపేట, అమరావతి ప్లాట్స్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, చెంచుపేట, ప్రభుత్వ ఆసుపత్రి, చిన్నరావూరు, రిజిస్ట్రేషన్ కార్యాలయ రోడ్డు, బుర్రిపాలెం రోడ్డు ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోనుంది.విద్యుత్ వ్యవస్థ అభివృద్ధి, మెరుగైన సరఫరా లక్ష్యంగా మరమ్మతులు, నూతన పరికరాల ఏర్పాటు చేపడుతున్నట్లు తెలిపారు.వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పనులు పూర్తయ్యే వరకు విద్యుత్ శాఖకు సహకరించాలని అశోక్‌కుమార్ కోరారు.

కుష్టి వ్యాధిగ్రస్తులకు ఏపీ స్టేట్ లెప్ర సొసైటీ వారి సేవలు అభినందనీయం



బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, మురసు తుఫాన్ ప్రభావం వలన ఆశ్రయం కోల్పోయిన బేతనీ కాలనీ లోని కుష్టి వ్యాధిగ్రస్తులకు ఏపీ స్టేట్ లెప్ర రా సొసైటీ వారి సహకారంతో బ్రెడ్ బిస్కెట్ ప్యాకెట్స్ వాటర్ బాటిల్స్ పాల ప్యాకెట్లను కాలనీలోని 135 మంది కుష్టి వ్యాధిగ్రస్తులకు బాపట్ల పట్టణ సిఐ ఆర్. రాంబాబు చేతుల మీదుగా అందజేసిరు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, తుఫాను సమయంలో లెప్ర సొసైటీ వారు కుష్టి వ్యాధిగ్రస్తులకు చేయుచున్న సేవలను అభినందించి ఉన్నారు. ఈ కార్యక్రమంలో లేప్రా సొసైటీ అసోసియేట్ భాష బేతనీ కాలనీ సంఘ పెద్దలు మరియు బేతనీ కాలనీ సోషల్ వర్కర్, ఎస్. జాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినారు

మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలలో పర్యటించిన అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం సభ్యులు



బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలలో పర్యటించేందుకు వచ్చిన అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం సభ్యులు చిత్తరంజన్ దాస్, సంయుక్త కార్యదర్శి, ప్రశాంత్ ఆర్మోరికర్, అదనపు అభివృద్ధి కమిషనర్, వ్యవసాయం రైతు సంక్షేమ శాఖ, హిమాలయ గార్గ్, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యయ శాఖ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ప్రణయ్ గార్గ్,డిప్యూటీ డైరెక్టర్, విద్యుత్ మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ , జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ యం.డి. ప్రఖర్ జైన్ లకు మురుసు, వరద బీభత్సాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఆపదలో ప్రయాణికులకు అండగా రోటరీ క్లబ్ సేవలు

రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల కు రైల్వే శాఖ ప్రశంసా పత్రం



బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

ఆపద సమయంలో ప్రయాణికులకు అండగా నిలిచి, మానవతా దృక్పథంతో సేవలందించిన రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల సేవలు అభినందనీయమని బాపట్ల రైల్వే స్టేషన్ చీఫ్ ఇన్స్పెక్టర్ గీత కొనియాడారు. ఇటీవల సంభవించిన మురుసు తుపాను నేపథ్యంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, పలు రైళ్లు బాపట్ల రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన సమయంలో ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన రోటరీ క్లబ్ సభ్యులు వారికి అల్పాహారం, మంచినీరు అందించి మానవతా సేవలు అందించారు. ఈ సేవలను గుర్తించిన రైల్వే శాఖ తరఫున శుక్రవారం బాపట్ల రైల్వే స్టేషన్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ప్రతినిధులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. తుపాను కారణంగా రైళ్లలో చిక్కుకుపోయిన ప్రయాణికులకు తమ వంతు సహాయం అందించాలనే సంకల్పంతో అల్పాహారం, మంచినీరు పంపిణీ చేసినట్లు తెలిపారు. తమ సేవలను గుర్తించి ప్రశంసా పత్రం అందజేయడం క్లబ్ సభ్యులకు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని అన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, కోశాధికారి కొళ్ళపూడి బాలాజీ, కొళ్ళపూడి ఉపేంద్ర గుప్త, రైల్వే స్టేషన్ మాస్టర్ మీన తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల వైసిపి కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ అర్షయా ను బలపరిచిన ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి



పోరుమామిళ్ల, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) పోరుమామిళ్ల పట్టణ వైసిపి సర్పంచ్ అభ్యర్థిగా షేక్ అర్షయాను వైసిపి నాయకుడు ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఆదిత్య రెడ్డి, మాజీ పంచాయతీ రాజ్ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జున్ రెడ్డి, కల్లూరి రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సీఎం భాష, రాజు భాష మొదలుకు వైసిపి నాయకులు అర్షయను పూర్తి మద్దతుతో ఆమెను బలపరిచారు గతంలో పోరుమామిళ్ల పట్టణంలో 1 వార్డు మెంబర్గా షేక్ హుస్సేన్ పీరా తమ వార్డు పరిధిలోని ప్రజలకు సేవలందించడంతో వారి కోడలైన అర్షయాను పోరుమామిళ్ల వైసిపి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయించడం జరుగుతుందని అదేవిధంగా ఉన్నత విద్యావంతురాలు కావడంతో ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి మంచి పేరు ప్రఖ్యాతలు గల కుటుంబం అని వారు తెలిపారు కావున ప్రజలు విద్యావంతులైన అర్షయాను ఆదరించి అభివృద్ధి జరిగే విధంగా ప్రజలు ఆశీస్సులు అందించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపల్లి నరసింహులు, రాష్ట్ర డాక్టర్ విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మాజీ ఎంపిటిసి ఈషాక్, పోరుమామిళ్ల పట్టణానికి చెందిన వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు

నాగేంద్ర స్వామి ఆలయంలో నాగుల చవితి వేడుకలు

తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు.. పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు

బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బాపట్ల పట్టణంలోని రెండో వార్డు రామకృష్ణాపురం పుట్ట బజారులో కొలువై ఉన్న శ్రీ నాగేంద్ర స్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం విజయలక్ష్మిపురంలోని సత్యనారాయణ స్వామి ఆలయం లో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. నాగుల చవితి పర్వదినం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్ట వద్ద పాలు పోసి, పసుపు, కుంకుమ సమర్పించి భక్తిశ్రద్ధలతో నాగదేవతను ఆరాధించారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సంతాన సౌభాగ్యం కలగాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు, యువతులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. నాగుల చవితి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయం భక్తిభావంతో మార్మోగింది. భక్తులు అత్యంత నియమనిష్ఠలతో వేడుకల్లో పాల్గొని నాగేంద్ర స్వామి ఆశీస్సులు పొందారు. ఈ విధంగా రామకృష్ణాపురంలోని నాగేంద్ర స్వామి ఆలయంలో నాగుల చవితి వేడుకలు భక్తుల కోలాహలం మధ్య




ఘనంగా ముగిశాయి.

మురసు తుపాను తీవ్రమైన నష్టాన్ని మిగిల్చింది అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం నాయకులు, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్

బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

మురసు తుపాను తీవ్రమైన నష్టాన్ని మిగిల్చిందని అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం నాయకులు, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ అన్నారు. మురసు తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు నియమితులైన కేంద్ర బృందం శుక్రవారం జిల్లాకు చేరుకుంది. జిల్లాకు చేరుకున్న కేంద్ర బృందం సభ్యులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, మొక్కలను అందించి ఘనంగా ఆహ్వానం పలికారు. తుపానుతో జిల్లాలో అపార నష్టం వాటిల్లిన దృశ్యాలపై స్థానిక కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను కేంద్ర బృందం పరిశీలించింది.

తుపాను ప్రభావంతో జిల్లాకు వాటిల్లిన నష్టం అంచనాలను పి పి టి ద్వారా కేంద్ర బృందానికి జిల్లా కలెక్టర్ వివరించారు. తదుపరి నష్టం అంచనాలపై రూపొందించిన నివేదికను కేంద్ర బృందం సభ్యులకు కలెక్టర్ అందజేశారు. వ్యవసాయ, ఆక్వా రంగాలకు, విద్యుత్తు, రహదారుల వ్యవస్థకు అపార నష్టం సంభవించడంతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం నాయకులు చిత్తరంజన్ దాస్ అన్నారు. తుపాను జన జీవనాన్ని దెబ్బ తీసిందన్నారు. నష్టం అంచనాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ పరిశీలించిన అంశాలను కేంద్రానికి వివరిస్తామన్నారు. ఆర్ టి జి ఎస్ వ్యవస్థ ద్వారా, ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని కలెక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించారన్నారు. బాపట్ల జిల్లాపై తుపాను విరుచుకు పడినప్పటికీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని భారీగా నివారించగలిగారన్నారు. లోతట్టు ప్రాంతాలలో నిరాశ్రయులైన వందలాది కుటుంబాలను ఆదుకుని పునరావాసం కల్పించడం అభినందనీయమన్నారు. తుపాను నష్టంపై క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకోడానికి ప్రభుత్వ యంత్రాంగం పక్కాగా సర్వే నిర్వహించిందన్నారు. మురసు తుపానుతో బాపట్ల జిల్లా అపార నష్టానికి గురైందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. 15 మండలాలు తుపాను ప్రభావానికి గురి



కాగా, అందులో 9 మండలాలు బాగా దెబ్బతిన్నాయన్నారు. మార్టూరు మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, పర్చూరు, బాపట్ల, కారంచేడు మండలాలలో 21 గ్రామాలు నీట మునిగాయన్నారు. ముగ్గురు వ్యక్తులు మరణించగా, 28 జీవాలు మృతి చెందాయన్నారు. 1,470 గృహాలు నీట మునిగాయన్నారు. 153 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నిరాశ్రయులైన 11,507 మందికి ఆశ్రయంతో పాటు భోజన వసతి కల్పించామన్నారు. మురసు తుపానుతో బాపట్ల జిల్లాకు రూ.320.49 కోట్లు నష్టం వాటిల్లిందని కలెక్టర్ కేంద్ర బృందానికి వివరించారు. తుపానుతో 10,789 మందికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. 4,129.42 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని, రైతులకు సంబంధించిన 6,251 ట్రాక్టర్లు దెబ్బతినగా వాటి విలువ మొత్తం రూ.9.89 కోట్లు ఉంటుందన్నారు. 140.608 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినగా వాటి విలువ రూ.45.438 లక్షలుగా అంచనా వేశామన్నారు. 302 బోట్లు, వలలు దెబ్బతినగా రూ.28.10 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. జీవనోపాధి కోల్పోయిన 13,214 మందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశామన్నారు. ప్రధానంగా 331.92 కిలోమీటర్ల మేర 94 ఆర్ అండ్ బి రహదారులు, 20 బ్రిడ్జిలు దెబ్బతిన్నాయని, వాటి నష్టం రూ.204.86 కోట్లుగా గుర్తించామన్నారు. ప్రధానమైన నల్లమడ, ఓగేరు వాగు, నక్క వాగు, పర్చూరు వాగు, ఆలేరు కాల్వలతోపాటు, 259 కాల్వలు దెబ్బతిన్నాయని, వాటికి రూ.55.44 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. 33 కెవి స్తంభాలు-698, విద్యుత్ లైన్ లు 33.77 సీకేఎం దెబ్బతిన్నాయని, 11 కెవి స్తంభాలు-3,443, అలాగే విద్యుత్తు లైన్ లు 102.9 సీకేఎం, ఎల్ టి స్తంభాలు 2,064, విద్యుత్ లైన్ లు 165.54 దెబ్బతిన్నాయన్నారు. 141 సౌర విద్యుత్ పలకలు దెబ్బతినగా మొత్తంగా విద్యుత్ శాఖకు రూ.22.39 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. 6,647 నివాసగృహాలు దెబ్బతిన్నగా వాటి విలువ రూ.7.98 కోట్లు అంచనా వేశామన్నారు. పంచాయతీరాజ్ రహదారులకు రూ.10.41 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. బాపట్ల, రేపల్లె, చీరాల మున్సిపాలిటీలలో కాల్వలు, రహదారులు దెబ్బతినగా, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు రూ.3.11 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. వివిధ రంగాలలో జరిగిన నష్టాలను కేంద్ర బృందానికి వివరించారు. ఈ సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ అదనపు అభివృద్ధి కమిషనర్ ప్రశాంత్ ఆర్మోరికర్, కేంద్ర ఆర్థిక, వ్యయ మంత్రిత్వశాఖ సహాయ సంచాలకులు హిమాలయ గార్గ్, విద్యుత్ మంత్రిత్వశాఖ, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ ఉప సంచాలకులు ప్రణయ్ గర్గ్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థులకు 'అటిక్' వ్యవసాయ సాంకేతిక కేంద్రం పై అవగాహన

బాపట్ల నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని శుక్రవారం బాపట్ల వ్యవసాయ కళాశాల లో ఉన్న వ్యవసాయ సాంకేతిక సమాచార కేంద్రం ను విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ విభాగ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ మండవ శ్రీనివాసరావు విద్యార్థులకు కేంద్రంలోని విభాగాలు మరియు వాటి పనితీరును సమగ్రంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ, 'అటిక్' అనేది రైతులకు శాస్త్రవేత్తలకు మధ్య వారధిగా పనిచేసే ఒక సింగిల్ విండో (ఏకగవాక్ష) సమాచార కేంద్రమని, ఇది రైతులు తమ పొలాల్లో ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలు మరియు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒకే చోట అందించేలా పనిచేస్తుందని తెలిపారు. విత్తనం వేసినప్పటి నుండి, పంట కోత అనంతరం ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వరకు ప్రతి దశలో అవసరమైన సాంకేతిక సమాచారంతో పాటు, వ్యవసాయం



మరియు అనుబంధ రంగాల సమాచారం ఇక్కడ అందుబాటులో ఉంటుందని ఆయన విద్యార్థులకు వివరించారు.

ఈ కేంద్రంలో వివిధ పంటల నమూనాలు, ఆధునిక సాగు పద్ధతులు, రైతులకు అవగాహన కల్పించే సమాచార చార్టులు, ప్రచురణలు, నాణ్యమైన విత్తనాలు, నారు మొక్కలు, జీవ ఎరువులు, వర్మీ కంపోస్ట్, మరియు పంట ఉత్పత్తుల నుండి తయారు చేసిన వివిధ రకాల ప్రాసెస్డ్ ఫుడ్ నమూనాలు ప్రదర్శనకు ఉంచబడ్డాయి. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సాంకేతికత రైతులకు ఎలా చేరుతుందో ప్రత్యక్షంగా తెలుసుకోవడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ మండవ శ్రీనివాసరావు కి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి మంగళగిరి - తాడేపల్లి ఎన్నికల నామినేషన్లు

16న మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ

26న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు

మంగళగిరి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ మేయర్, డివిజన్లలో కార్పొరేటర్ ఎన్నికలకు ఈ నెల 14 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ షేక్ అలీమ్ బాషా తెలిపారు. ఎన్నికల నిర్వహణపై శుక్రవారం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన గడువులకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు కమిషనర్ చెప్పారు. ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చు. 17న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన చేపడతారు. 19న



మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత నమూనాలో నామినేషన్ పత్రాలను పూర్తి చేసి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత రిటర్నింగ్ అధికారి లేదా సహాయ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని కమిషనర్ సూచించారు. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయాలతో పాటు మంగళగిరి ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు కేంద్రాలను కేటాయించారు. ఈ నెల 26న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

30న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎన్నికల ప్రచార సభలు, ఊరేగింపులు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరించడం, కులం లేదా మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తామని చెప్పారు.

తాగునీటి రంగు మార్పుపై ఆందోళన వద్దు

● ఈ వారంలో 1,037 నీటి నమూనాలకు పరీక్షలు ● నీటిని కాచి, చల్లార్చి తాగాలని కమిషనర్ సూచన

మంగళగిరి నవంబర్ 13 (విజన్ ఆంధ్ర)

తాగునీటి రంగులో స్వల్ప మార్పు కనిపించినా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంగళగిరితాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ షేక్ అలీమ్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న గోదావరి జలాలు కృష్ణా నదిలో కలవడంతో నది నీటి రంగులో స్వల్ప మార్పు కనిపిస్తోందని వివరించారు.కృష్ణా నది నుంచి తీసుకొచ్చిన నీటిని నగరపాలక సంస్థ శుద్ధి కేంద్రాల్లో పటికతో శుద్ధి చేసి, క్లోరినేషన్ చేస్తున్నట్లు తెలిపారు. శుద్ధి చేసిన నీటి నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరమే తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఇళ్ల నుంచి నీటి నమూనాలను సేకరించి, నీటిలో మిగిలిన క్లోరిన్ స్థాయిని తెలుసుకునేందుకు ఆర్‌సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వారంలో మొత్తం 1,037 నమూనాలను సేకరించి పరీక్షించామన్నారు. ముందు జాగ్రత్తగా నీటిని బాగా కాచి, చల్లార్చిన తర్వాతే తాగాలని సూచించారు.

నీటి సరఫరాపై ఫిర్యాదులకు- మంగళగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హెచ్. రమేష్ బాబు 8500085027, - తాడేపల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. రాము 8309549599- సూపరింటెండింగ్ ఇంజినీర్ లీలా కృష్ణ ప్రసాద్ 8985676655, నెంబర్లకు సంప్రదించి తెలియజేయవచ్చు అన్నారు.



తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం.

– జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

– 13 మండలాల్లో 176 గ్రామ పంచాయతీలకు 1,788 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

– నవంబర్ 15 నుంచి నామినేషన్ల స్వీకరణ 26న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు

– మొదటి విడతలో ఓటు హక్కును వినియోగించుకోనున్న3.71 లక్షల మంది ఓటర్లు

కడప,నవంబర్ 13(విజన్ ఆంధ్ర) జిల్లాలోని తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వ హించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడతకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో.వైఎస్సార్ కడప జిల్లాలో తొలి విడత ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు, సన్నద్ధత వివరాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వెల్లడించారు.తొలి విడతలో 13 మండలాల్లోని 176 గ్రామ పంచాయతీల సర్పంచి,వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని, ఇందుకోసం 1,788 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మొదటి విడత ఎన్నికల్లో 3,71,999 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై, 26వ తేదీన పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు.

13 మండలాల్లో తొలి విడత ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలోని అట్లూరు, బి.కోడూరు,బద్వేలు, గోపవరం, కలసపాడు, పోరుమామిళ్ల, శ్రీ అవధూత కాశీనాయన, సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, సుండుపల్లి, వీరబల్లి మండలాల్లో తొలి విడత ఎన్నికలు జరగనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ మండలాల్లో మొత్తం 176 గ్రామ పంచాయతీలకు సర్పంచి ఎన్నికలు,1,768 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించ నున్నారు. ఇందుకోసం 1,788 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 3,71,999 మంది ఓటర్లు ఈ విడతలో ఓటు వేయనున్నట్లు వివ రించారు.

మండలాల వారీగా ఎన్నికల వివరాలు:–

పోరుమామిళ్ల మండలంలో 17 గ్రామ పంచాయతీలు, 180 వార్డులకు 200 పోలింగ్ కేంద్రాలు; గోపవరం మండలంలో 7 గ్రామ పంచాయతీలు, 70 వార్డులకు 70 పోలింగ్ కేంద్రాలు; బద్వేలు మండలంలో 10 గ్రామ పంచాయతీలు, 98 వార్డులకు 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.అట్లూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 116 వార్డులకు 116 పోలింగ్ కేంద్రాలు; శ్రీ అవధూత కాశీనాయన మండలంలో 17 గ్రామ పంచాయతీలు, 160 వార్డులకు 160 పోలింగ్ కేంద్రాలు; బి.కోడూరు మండలంలో 10 గ్రామ పంచాయతీలు, 98 వార్డులకు 98 పోలింగ్ కేంద్రాలు; కలసపాడు మండలంలో 13 గ్రామ పంచాయతీలు,130 వార్డులకు130 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.సుండుపల్లి



మండలంలో 11 గ్రామ పంచాయతీలు, 126 వార్డులకు 126 పోలింగ్ కేంద్రాలు; నందలూరు మండలంలో 11 గ్రామ పంచాయతీలు, 120 వార్డులకు 120 పోలింగ్ కేంద్రాలు; వీరబల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు,130 వార్డులకు 130 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.రాజంపేట మండలంలో 25 గ్రామ పంచాయతీలు, 242 వార్డులకు 242 పోలింగ్ కేంద్రాలు; సిద్ధవటం మండలంలో 18 గ్రామ పంచాయతీలు, 168 వార్డులకు 168 పోలింగ్ కేంద్రాలు; ఒంటిమిట్ట మండలంలో 13 గ్రామ పంచాయతీలు, 130 వార్డులకు 130 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

15 నుంచి నామినేషన్ల స్వీకరణ

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 15వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబర్ 18న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. తిరస్కరించిన నామినేషన్లపై 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి వద్ద అప్పీలు చేసుకోవచ్చు. నవంబర్ 20న అప్పీళ్లను పరిష్కరిస్తారు. 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారని కలెక్టర్ తెలిపారు.

26న పోలింగ్. అదే రోజు ఫలితాలు:

నవంబర్ 26వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. అదే రోజు ఉప సర్పంచి ఎన్నిక కూడా నిర్వహిస్తారు. అవసరమైతే నవంబర్ 27వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తిరిగి పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారని వివరించారు.

బ్యాలెట్ పెట్టెలు, ఎన్నికల సామగ్రి సిద్ధం

తొలి విడతలోని 176 గ్రామ పంచాయతీలకు 1,788 బ్యాలెట్ పెట్టెలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. వీటిలో 605 పెట్టెలు ఇప్పటికే మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని,మిగిలిన అవసరానికి అనుగుణంగా 87 పెద్దవి, 804 మధ్యస్థ పరిమాణం కలిగినవి, 292 చిన్న పరిమాణం కలిగిన బ్యాలెట్ పెట్టెలను సమకూర్చుకునేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ అనంతరం స్వీకరణ, బ్యాలెట్ పెట్టెల భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా 39 పంపిణీ కేంద్రాలు, 39 స్వీకరణ కేంద్రాలు, 39 భద్రపరిచే గదులను గుర్తించినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామగ్రిని సకాలంలో అందించడంతో పాటు పోలింగ్ అనంతరం వాటిని భద్రంగా స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

14,702 మంది సిబ్బందికి విధులు:–

జిల్లాలోని మొత్తం 6,136 పోలింగ్ కేంద్రాలకు 6,136 మంది ప్రిసైడింగ్ అధికారులు, 8,566 మంది ఇతర పోలింగ్ అధికారులు కలిపి 14,702 మంది సిబ్బంది అవసరమని గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యను బట్టి సిబ్బందిని కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోలింగ్ నిర్వహణ, విధులు,బాధ్యతలపై శిక్షణ ఇచ్చేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 39 మండలాల్లో శిక్షణ కేంద్రాలను గుర్తించి సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు జిల్లావ్యాప్తంగా 129 జోన్లను గుర్తించి 138 మంది జోనల్ అధికారులను నియమించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి రవాణా, పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ కోసం 256 రూట్లను గుర్తించి 272 మంది రూట్ అధికారులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 185 క్లస్టర్లను గుర్తించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులను నియమిస్తు న్నట్లు తెలిపారు.

సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా:

జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను సాధారణ, సున్నితమైన (సెన్సిటివ్), అత్యంత సున్నితమైన కేంద్రాలుగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,480 సాధారణ, 1,911 సున్నితమైన, 1,745 అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షించేందుకు 39 ఫ్లైయింగ్ నిఘా బృందాలు, 39 సిట్టింగ్ నిఘా బృందాలను గుర్తించినట్లు తెలిపారు.

ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు:

సేవా ఓటర్లు, ముందస్తు నిర్బంధంలో ఉన్న ఓటర్లు, ఓటర్ల జాబితాలో ఉన్నప్పటికీ అందుబాటులో లేని ఓటర్లకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు ఓటరు గుర్తింపు చీటీల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక సౌకర్య కేంద్రం ద్వారా సంబంధిత సేవలు అందించనున్నట్లు వివరించారు.

ఎన్నికల నియమాలు తప్పనిసరిగా పాటించాలి

ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గ దర్శకాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. న్యాయస్థానాల ఉత్తర్వులు అమల్లో ఉన్న గ్రామ పంచాయతీలు లేదా పదవులకు సంబంధించి ఎన్నికల నోటీసులు జారీ చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించినట్లు తెలిపారు

మఠం భూముల ఆక్రమణలపై

హైకోర్ట్ తీర్పు హర్షనీయం - బుక్కే శివా నాయక్



తిరుపతినవంబర్ 13(విజన్ ఆంధ్ర)

హాథీరాం బావాజీ మఠం భూముల ఆక్రమణలపై గురువారం హైకోర్టు తీర్పు హర్షనీయమని తిరుపతి శ్రీ హాథీరాం బావాజీ ఆలయ ట్రస్ట్ చైర్మన్ బుక్కే శివా నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. తిరుపతి మంచినీళ్ల గుంట వెనుక వైపు ఉన్న మఠం భూముల స్థలంలో బుక్కే శివా నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం హథిరాం బావాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టెంకాయలు కొట్టడం జరిగింది. ఈ సందర్భంగా శివానాయక్ మాట్లాడుతూ సర్వే నంబర్ 942ఏ లోని 2.7 ఎకరాలు కల్గిన మంచినీళ్ళగుంట వెనక ఉన్న ఈ హాథీరాం బావాజీ మఠంలో విద్యాబోధన కని మూడు దశాబ్దాల ముందు లీజ్ కు తీసుకుని, ఇప్పటికీ తమదే ఈ స్థలమని కోర్టుకెక్కిన ఆక్రమణదారులపై హైకోర్టు గురువారం కేసు కొట్టి వేయడం జరిగిందన్నారు. అసలు ఏమాత్రం లీజు దారులకు సంబంధంలేని వ్యక్తికి గత ఏడాది దేవాదాయశాఖ జారీ చేసిన ప్రొసీడింగ్స్ ను హైకోర్టు గురువారం సస్పెండ్ చేసిందన్నారు. వెంటనే మఠం అధికారులు ఈ స్థలాన్ని స్వాదీనం చేసుకొని మఠం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా హాథీరాం బావాజీ ఆస్తులను కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తామని శ్రీ హాథీరాం బావాజీ ఆలయ ట్రస్ట్ చైర్మెన్ బుక్కె శివా నాయకు స్పష్టం చేసారు.

అద్దె లావాదేవీల్లో జీఎస్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

అద్దెలపై జీఎస్టీ, రివర్స్ ఛార్జ్ విధానంపై పన్ను నిపుణులకు అవగాహన కల్పించిన జాయింట్ కమిషనర్ జి. సుమతి



కడప,డిసెంబర్ 12 (విజన్ ఆంధ్ర)

అద్దె చెల్లింపులకు సంబంధించి వస్తు సేవల పన్ను (జీఎస్టీ) నిబంధనలు, రివర్స్ ఛార్జ్ విధానం (ఆర్సీఎం) అమలుపై పన్ను నిపుణులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పన్నుల శాఖ కడప డివిజన్ జాయింట్ కమిషనర్ జి. సుమతి సూచించారు.శనివారం కడపలోని "మానస ఇన్" హోటల్‌లో రాష్ట్ర పన్నుల శాఖ కడప డివిజన్ ఆధ్వర్యంలో అద్దెలపై జీఎస్టీ, రివర్స్ ఛార్జ్ విధానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.

అద్దె చెల్లించే వ్యక్తి, అద్దె పొందే వ్యక్తికి జీఎస్టీ చట్టం ప్రకారం ఉండే బాధ్యతలను వివరించారు. పన్ను చెల్లింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిటర్నులలో నమోదు చేయాల్సిన వివరాలు,సంబంధిత నిబంధనలను తెలియ జేశారు.జీఎస్టీ చట్టం ప్రకారం అద్దెలపై పన్ను వర్తించే సందర్భాలు, పన్ను చెల్లించాల్సిన బాధ్యతలు, నమోదు అవసరాలు, పన్ను వివరాలను దాఖలు చేసే విధానాలపై స్పష్టత కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా పన్ను నిపుణులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు.పన్ను చెల్లింపుదారులు చట్టంలోని నిబంధనలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించాలని సూచించారు.ఆడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ అద్దెలపై జీఎస్టీ, రివర్స్ ఛార్జ్ విధానంపై పన్ను నిపుణులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ సదస్సులో జిల్లాకు చెందిన ఆడిటర్లు, పన్నుల శాఖలో నమోదు చేసుకున్న పన్ను ప్రతినిధులు,చార్టర్డ్ అకౌంటెంట్లు,ఇతర పన్ను నిపుణులు పాల్గొన్నారు. జీఎస్టీ నిబంధనల అమలుపై శాఖాధికారులు, పన్ను నిపుణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కడప డివిజన్ డిప్యూటీ కమిషనర్ కె. కేదారేశ్వర రావు,కడప-1 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ పి. పద్మావతి, కడప-2 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ డి. రవి కుమార్ రెడ్డి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఘంటసాల నుంచి ఖండాంతరాలకు పద్య పరిమళం!

– తెలుగు విశ్వవిద్యాలయ 'కీర్తి పురస్కారం'తో బందరు కవి పండితుడికి సమున్నత గౌరవం

– ఆధ్యాత్మిక ప్రబంధాలు, ఆలయ వారసత్వ పరిరక్షణతో సాహితీ ప్రస్థానం

– డాక్టర్ చింతలపాటి మోహన మురళీకృష్ణపై అభినందనల వెల్లు

విజయవాడ, నవంబరు 13 (విజన్ ఆంధ్ర): కృష్ణా జిల్లా ఘంటసాలలో పుట్టి, మచిలీపట్నాన్ని తన సాహితీ వేదికగా మలచుకుని తెలుగు పద్య వైభవాన్ని ఖండాంతరాలకు వ్యాపింపజేస్తున్న ప్రముఖ కవి పండితుడు, విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చింతలపాటి మోహన మురళీకృష్ణకు అరుదైన సాహితీ గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025 సంవత్సరానికి గాను ప్రకటించిన ప్రతిష్ఠాత్మక 'కీర్తి పురస్కారం' పద్యరంగంలో ఆయన్ను వరించింది. తెలుగు భాషా సాహిత్యాలు, పద్య రచన, లలిత కళలు, జానపద కళల విభాగాలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 36 మంది నిష్ణాతులను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ తరపున పద్య ప్రక్రియలో డాక్టర్ చింతలపాటి ఎంపిక కావడం విశేషం. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న వేడుకలో ఈ పురస్కారంతో పాటు రూ. 10,000 నగదు పారితోషికం, ప్రశంసా పత్రంతో ఆయనను ఘనంగా సత్కరించనున్నారు.

'సిరి' కావ్యాలతో సాహితీ సృజన..

శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణువుపై ఉన్న అపార భక్తితో తాను రచించిన పలు కావ్యాలకు 'సిరి' అనే పదం వచ్చేలా నామకరణం చేయడం మురళీకృష్ణ రచనా ప్రస్థానంలో ప్రత్యేక ఆకర్షణ. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిపై 333 పద్యాలతో



రచించిన 'సిరి మల్లెలు', శ్రీకాకుళం ఆంధ్ర మహావిష్ణువు చారిత్రక ఐతిహ్యంతో 300 పద్యాలలో మూడు ఆశ్వాసాలుగా మలచిన 'సిరికోవెల', స్వగ్రామం ఘంటసాల శ్రీ జలధీశ్వరస్వామి మహిమలను వర్ణిస్తూ 650 పద్యాలతో రాసిన 'సిరి దివ్వెలు' ప్రబంధాలు ఆయనకు విశేష కీర్తిని తెచ్చిపెట్టాయి. వీటితో పాటు 25 శీర్షికలతో 333 పద్యాలతో కూడిన 'వ్యాయి' ఖండకావ్యం, 2001లో వెలువడిన 'సిరిమువ్వలు' వచన కవితా సంపుటి, లక్ష్మణ యతీంద్రులు తదితర ఆధ్యాత్మిక గురువుల చరిత్రలను తెలిపే పద్య కావ్యాలతో పాటు అనేక శతకాలు, కథలు, సాహిత్య వ్యాసాలను ఆయన సాహితీ లోకానికి అందించారు. అంతేకాదు, శ్రీకాకుళంలోని చారిత్రక ఆంధ్రమహావిష్ణువు ఆలయంలో 'ఆముక్తమాల్యద మండపం' పునర్నిర్మాణం కోసం స్థానిక ప్రముఖులను ప్రేరేపించి ఆ నిర్మాణం పూర్తి కావడంలో కీలక పాత్ర పోషించడం ఆయన ఆలయ వారసత్వ అభిమానానికి నిదర్శనం.

విద్యార్థి దశ నుంచే సాహితీ వ్యాసంగం..

మచిలీపట్నం హిందూ కళాశాలలో బి.ఏ. చదివే రోజుల్లోనే సాహిత్య సభలను స్థాపించి నెలవారీ సాహితీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మురళీకృష్ణ, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో ఎం.ఏ. పట్టా పొందారు. ఉపాధ్యాయుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన ఆయన, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దుతూనే తన జీవితాన్ని తెలుగు భాషా పరిరక్షణకు అంకితం చేశారు.

అంతర్జాల వేదికగా విశ్వవ్యాప్త బోధన

మచిలీపట్నం వేదికగా నిరంతరం సాహితీ, సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని అంతర్జాల మాధ్యమంగా విదేశాల్లోని ప్రవాస భారతీయులకు, తెలుగు భాషాభిమానులకు ఛందస్సు, పద్య రచనలో మెళకువలు బోధిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో వర్చువల్ కవి సమ్మేళనాలు, సాహితీ గోష్ఠులు నిర్వహిస్తూ వర్ధమాన కవులను ప్రోత్సహిస్తున్నారు. సాహితీ సేవలకు గుర్తింపుగా ఇప్పటికే 'కావ్య కళా ప్రపూర్ణ' వంటి ప్రతిష్ఠాత్మక బిరుదుతో పాటు ఉగాది పురస్కారాన్ని, రాష్ట్రవ్యాప్తంగా పలు సన్మానాలను అందుకున్నారు. తాజాగా తెలుగు విశ్వవిద్యాలయ 'కీర్తి పురస్కారం' వరించడం పట్ల మచిలీపట్నం, ఘంటసాల ప్రాంతాల సాహితీ, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, కవులు, శిష్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు.

"గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ"



కడప, నవంబర్ 13(విజన్ ఆంధ్ర)

గౌరవ జిల్లా ప్రధాన మరియు సెషన్స్ న్యాయమూర్తిని జి.రామ గోపాల్ వారిని, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మరియు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుగులి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ, కడప నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి పుష్ప మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని తదితర అంశాలపై పరస్పరం చర్చించారు.

గోవింద రెడ్డి వ్యక్తిత్వం ఏలాంటిదో నియోజకవర్గ ప్రజలకు తెలుసు :ఎమ్మెల్యే డా,, సుధ



బద్వేలు, నవంబర్13 (విజన్ ఆంధ్ర)

బద్వేలు నియోజకవర్గంలో గత 25 సంవత్సరాలుగా ఎటువంటి కక్షలు,కార్పన్యాలు లేకుండా సుపరిపాలన అందించిన గోవింద రెడ్డి వ్యక్తిత్వం ఏమిటో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా పేర్కొన్నారు.ఇటీవల టిడిపి నేతలు ప్రెస్ మీట్ లో గోవింద రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు.శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో కాలనీలో ఎమ్మెల్యే నివాసంలో ఆమె మాట్లాడుతూ గోవిందరెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా నియోజకవర్గం లోని అన్ని వర్గాల ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్న నేత గోవింద రెడ్డి అని అన్నారు.అందుకే గత 25 ఏళ్లుగా నియోజక వర్గంలోని ప్రజలు అన్ని ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అభ్యర్థులకు పట్టం కడుతూ వస్తున్నారని అన్నారు.అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో 2019– 2024 మధ్యకాలంలో మునుపెన్నడూ లేనివిధంగా బద్వేలు నియోజకవర్గాన్ని రూ.400 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత గోవింద రెడ్డి దని ఆమె గుర్తు చేశారు. బద్వేలు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా గోవిందరెడ్డి పాలన అందించారని ఆమే కొనియాడారు. అదేవిధంగా అభివృద్ధి విషయంలో నియోజకవర్గంలో ఏ ఒక్కరిని అడిగినా చెబుతారని ఆమె అన్నారు. గడచిన 25 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలో ఏ ఒక్క ప్రతిపక్ష నేతనైనా గోవిందరెడ్డి ఇబ్బందులకు గురిచేసారేమో,ఎన్నికలలో అక్రమాలకు అరాచకాలకు పాల్పడ్డారేమో తెలపాలని ప్రశ్నించారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారిగా సేవలు అందించిన ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా అదే హుందా తనంతో పాలన అందించారని ఏ ఒక్క ప్రభుత్వ అధికారిని కూడా తక్కువ చేసి మాట్లాడిన చరిత్ర లేదని ఆమె అన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికలలో అప్రజాస్వామ్య విధానాలకు పాల్పడి,అరాచకాలు సృష్టించి ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను నామినేషన్లు సైతం వేయకుండా అడ్డుకున్నారని ఆమె తీవ్రంగా దుయ్యబట్టారు బద్వేలు నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీకి కంచుకోట అని ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు జరిగితే వైఎస్ఆర్ సీపీ అభ్యర్థుల విజయాన్ని ఎవరు కూడా ఆపలేరు అనే విషయాన్ని టిడిపి నేతలు గుర్తించాలని అన్నారు నియోజకవర్గంలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించి గెలుపొందితే ఎవరి సత్తా ఏమిటో తెలుస్తుందని టిడిపి నాయకులకు ఆమె తెలిపారు

మాజీ ఎమ్మెల్యే విజయమ్మను మర్యాద పూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్



బద్వేలు, నవంబర్ 13 (విజన్ ఆంధ్ర) బద్వేలు మాజీ ఎమ్మెల్యే కొని రెడ్డి విజయమ్మ, మాజీ నియోజకవర్గ ఇన్చార్జ్ రితిష్ రెడ్డిని బద్వేలు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దివ్య తేజ, కుటుంబ సభ్యులు అయిన డా,, క్రాంతి, తెలుగు గంగ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధనుంజయ శుక్రవారం ఉదయం బద్వేల్ పట్టణంలోని విజయమ్మ నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు అనంతరం విజయమ్మ,రితీష్ రెడ్డి ల ఆశీర్వాదం తీసుకొన్నారు బద్వేలు మున్సిపాలిటీనీ అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించి పట్టణ ప్రజల మన్ననలు పొందాలని వారు చైర్మన్ డాక్టర్ దివ్య తేజకు సూచించారు అనంతరం డాక్టర్ దివ్య తేజ కుటుంబ సభ్యులను విజయమ్మ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చైర్మన్ బంధువులు పాల్గొన్నారు

The imprint line should be printed legibly as Printed by Published by JAKKULA NARENDER on behalf of JAKKULA NARENDER, printed at and published at 76-6-01 BHATSING ROAD CHATIYNA APTS NEAR SWATHI CENTER BHAVANIPURAM VIJAYAWADA editor JAKKULA NARENDER.